Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 277 మేడ్చల్ మల్కాజ్‌గిరి 26 అక్టోబర్ 2023 గురువారం పేజీలు : 4

## రష్యాకు ఒక చట్టం, ఇజ్రాయెల్‌కు ఇంకో చట్టమా?

శ్రీనగర్: ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం భీకరరూపం దాల్చడంపై జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా స్పందించారు. రష్యాకు ఒక చట్టం, ఇజ్రాయెల్‌కు ఒక చట్టమా అని ప్రశ్నించారు. గాజాపై బాంబుల వర్షం కురిపిస్తుండటం వల్ల వందలాది మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "యుద్ధం మొదలైన మొదటిరోజు నుంచి గాజాలో జరుగుతున్న దాన్ని మేము వ్యతిరేకిస్తున్నాం. గాజాపై బాంబుల వర్షం కురిపిస్తుండటం వల్ల అమాయక ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నారు. రష్యా, ఇజ్రాయెల్ విషయంలో భిన్నమైన చట్టాలున్నాయని ప్రపంచం చూటుకుంటోంది" అంటూ అంతర్జాతీయ ప్రపంచంపై ఒమర్ అబ్దుల్లా విమర్శలు గుప్పించారు. ఉక్రెయిన్‌పై రష్యా దాడి వార్ క్రైమ్ అని చెప్పిన ప్రపంచదేశాలు, ఇజ్రాయెల్ అదే పని గాజాపై చేస్తే తప్పనిపించడం లేదా? అని నిలదీశారు.

# తెలంగాణలో క్లియర్ పిక్చర్

## ఆ పార్టీదే అధికారం

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న కొద్ది అధికార బి ఆర్ ఎస్ పార్టీలో ఆందోళన రోజురోజుకు పెరుగుతుంది. తెలంగాణ రాష్ట్రంలో వరుసగా వస్తున్న సర్వేలలో మెజార్టీ సర్వేలు కాంగ్రెస్ పార్టీ ఈసారి భారీగా పుంజుకుందని, కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేసే అవకాశాలను వెల్లడించాయి.

ఈసారి బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం అంత ఈజీ కాదని స్పష్టం చేశాయి. అందుకు తగ్గట్టే కాంగ్రెస్ పార్టీ కూడా ప్రజాక్షేత్రంలో దూకుడుగా ముందుకు వెళుతుంది. కాంగ్రెస్ పార్టీ తన గ్రాఫ్ ను అనూహ్యంగా పెంచుకుంటూ ముందుకు సాగుతుంది. ఇటీవల ఇండియా టీవీ సి ఓటర్ సర్వే కూడా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో విజయకేతనం ఎగర వేస్తుంది అని చెప్పడంతో ఆందోళనలో ఉన్న బి ఆర్ ఎస్ దిద్దుబాటు చర్యలకు దిగింది. సీఎం కేసీఆర్ క్రైసిస్ మేనేజ్మెంట్ కు ప్రణాళిక సిద్ధం చేసినట్లుగా సమాచారం. ఒకే ఇంట్లో నుంచి బరిలో దిగనున్న భార్య భర్తలు. గెలుపెవరిదో.. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో గెలిచేది బీఆర్ఎస్ పార్టీ నే అని సర్వే సంస్థల ద్వారా వెల్లడించడానికి కేటీఆర్ తెగ ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. అయితే కొన్ని క్రెడిబిలిటీ ఉన్న సంస్థలు బీఆర్ఎస్ గెలుస్తుంది అన్న ప్రచారాన్ని తాము చేయలేమని, అలా చేస్తే తమ సంస్థకు క్రెడిబిలిటీ దెబ్బతింటుందని చెప్పినట్లుగా తెలుస్తుంది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ పుంజుకుంటుంది అన్న వేవ్ వస్తున్న నేపథ్యంలో, అలాంటిదేమీ లేదు తెలంగాణ రాష్ట్రంలో గెలిచేది బీఆర్ఎస్ పార్టీనే

## బీఆర్ఎస్ లో గుబులు!!

అని చెప్పడానికి తెలంగాణ సీఎం కేసీఆర్ తో పాటు మంత్రులు, నేతలు నానా అగచాట్లు పడుతున్నారు. ఇటీవల ఓ సర్వే సంస్థ తెలంగాణ రాష్ట్రంలో గెలిచేది బిఆర్ఎస్ పార్టీనే అని తమ సర్వే రిపోర్ట్ ను ప్రకటించడం కేటీఆర్ పెద్ద ఎత్తున ప్రచారానికి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారని సమాచారం.

తెలంగాణ రాష్ట్రంలో బిజెపి దారుణంగా ప్రస్తుతం వెనకబడి పోగా, కాంగ్రెస్ పార్టీ దూకుడును కొనసాగిస్తుంది. తెలంగాణలో ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ కాంగ్రెస్ పార్టీగా కనిపించటంతో బీఆర్ఎస్, బీజేపీ నుండి అసంతృప్త నేతలు కాంగ్రెస్ బాట పడుతున్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ నుంచి బిజెపిలోకి వెళ్లిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మళ్ళీ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు.

దీంతో కాంగ్రెస్ పార్టీపై తెలంగాణ రాష్ట్రంలో చర్చ జరుగుతుండగా, కాంగ్రెస్ పార్టీకి అంత సీన్ లేదని చెప్పడానికి శతవిధాల ప్రయత్నం చేస్తున్నారు బీఆర్ఎస్ నాయకులు.




దిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్యలో నిర్మిస్తోన్న రామ మందిరం ప్రారంభోత్సవానికి తేదీ ఖరారైంది. దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించి వచ్చే ఏడాది జనవరి 22న ఆలయాన్ని ప్రారంభించాలని ఆలయ కమిటీ నిర్ణయించింది. రామమందిరం ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీకి ఆహ్వానం అందింది.

ఈ మేరకు శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు ప్రధానిని దిల్లీలో కలిశారు. ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆయన్ను ఆహ్వానించారు. వారి ఆహ్వానాన్ని ప్రధాని స్వయంగా అంగీకరించారు. మూడంతస్తుల్లో నిర్మిస్తున్న ఆలయం భవనం గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణం డిసెంబర్ నాటికి పూర్తవుతుందని ఆలయ నిర్మాణ కమిటీ ఛైర్‌పర్సన్ నృపేంద్ర మిశ్రా ఇటీవల తెలిపారు. 2020 ఆగస్టు 5న ప్రధాని నరేంద్ర మోదీ అయోధ్యలో రామాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే.

**ఎంతో అదృష్టంగా భావిస్తున్నా.. ప్రధాని ట్వీట్ :** "ఈ రోజు భావోద్వేగాలతో నిండిన రోజు. ఇటీవల శ్రీ రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు అధికారులు నన్ను కలవడానికి నా నివాసానికి వచ్చారు. శ్రీరామ మందిర ప్రతిష్ఠాపన సందర్భంగా అయోధ్యకు రావాల్సిందిగా ఆయన నన్ను ఆహ్వానించారు. దీన్ని గొప్ప ఆశీర్వాదంగా భావిస్తున్నా. నా జీవితకాలంలో ఈ చారిత్రాత్మక సందర్భాన్ని చూడటం నా అదృష్టం" అని మోదీ ట్వీట్ చేశారు. ప్రధానితో సమావేశం అనంతరం శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్ మాట్లాడారు. 2024 జనవరి 22న ఆలయం గర్భగుడిలో శ్రీరాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు వెల్లడించారు. జనవరి 14న మకర సంక్రాంతి తర్వాత రామలల్లా ప్రతిష్ఠాపన ప్రక్రియను ప్రారంభించి, 10 రోజుల పాటు 'ప్రాణ ప్రతిష్ఠ' కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆలయ ట్రస్టు నిర్ణయించినట్లు సమాచారం.




## నర్సాపూర్ అభ్యర్థి ఎంపికపై కేసీఆర్ కీలక నిర్ణయం

హైదరాబాద్: నర్సాపూర్ అభ్యర్థి ఎంపికపై గత కొద్దిరోజులుగా బీఆర్ఎస్‌లో సాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. సీఎం కేసీఆర్ ఒకేసారి 115 మంది అభ్యర్థులు ప్రకటించారు. కానీ కొన్ని సీట్లను పెండింగ్‌లో పెట్టారు. దీంతో ఈ సీట్లపైనే అసలు సిసలైన హైడ్రామా నడిచింది. మొన్నటిదాకా జనగామ సీటు ఎవరికి ఇస్తారంటూ చర్చ నడిచింది. చివరికి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సొంతం చేసుకున్నారు.

పల్లా ఇప్పటికే బీఫామ్ అందుకున్నారు. జనగామ సీటులాగానే నర్సాపూర్ అభ్యర్థి ఎంపికపై కూడా తీవ్ర ఉత్కంఠ సాగింది. ప్రస్తుత ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి ఇస్తారా? లేదంటే సునీత లక్ష్మారెడ్డికి ఇస్తారా? అన్న ఆసక్తి చోటుచేసుకుంది. తీవ్ర కసరత్తు తర్వాత నర్సాపూర్ సీటుపై సీఎం కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సునీత లక్ష్మారెడ్డి పేరును ఖరారు చేస్తూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డితో కలిసి సునీతకు కేసీఆర్ బీఫామ్ అందచేశారు. మదన్ రెడ్డికి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. దీంతో కొద్ది రోజులుగా నర్సాపూర్ టికెట్‌పై సాగుతున్న ఉత్కంఠకు తెరపడినట్లైంది.




# మళ్లీ సొంత గూటికే...!

## బిజెపికి రాజగోపాల్‌రెడ్డి గుడ్‌బై

నల్గొండ: అసెంబ్లీ ఎన్నికల వేళ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కమలం పార్టీకి గట్టి షాకిచ్చారు. బీజేపీకి రాజీనామా చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల ప్రకటించిన ఫస్ట్ లిస్ట్‌లో ఆయన పేరు లేకపోవడంతోనే ఆయన పార్టీ మారబోతున్నారంటూ ఊహాగానాలు వినిపించాయి. ఆ వార్తలను నిజం చేస్తూ రాజగోపాల్‌రెడ్డి బీజేపీ రాజీనామాను ప్రకటించారు. మళ్లీ ఆయన సొంత గూటికే వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు. ఎల్లుండి హస్తినలో సోనియా, రాహుల్ సమక్షంలో హస్తం గూటికి చేరనున్నారు. 2018 ఎన్నికల్లో మునుగోడు నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తదనంతర పరిణామాలతో ఆయన కాంగ్రెస్‌కు రాజీనామా చేసి కాషాయం గూటికి చేరారు. తర్వాత జరిగిన మునుగోడు బైపోల్స్‌లో బీజేపీ నుంచి పోటీ చేసి అపజయం మూటగట్టుకున్నారు. దీంతో అప్పటి నుంచి ఆయన బీజేపీతో అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నారు. తాజా రాజకీయ పరిణామాలతో తిరిగి సొంత గూటికి చేరాలని నిర్ణయం తీసుకున్నారు. తాజాగా బీజేపీకి రాజీనామా చేస్తూ ఈ మేరకు రాజగోపాల్‌రెడ్డి పత్రికా ప్రకటన విడుదల చేశారు.

**లేఖలో..** "కేసీర్ కుటుంబ దుర్మార్గపు పాలన నుంచి తెలంగాణను విముక్తి చేయాలనే నా ఆశయం. మరో ఐదు వారాల్లో నెరవేరుతుందని భావిస్తున్నాను. రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేకత తీవ్ర స్థాయిలో ఉంది. ప్రజలు మార్పును కోరుకుంటున్నట్టు స్పష్టమవుతోంది. ఏడాదిన్నర క్రితం తెలంగాణలో అధికార బీఆర్ఎస్ కు ప్రత్యామ్నాయంగా ఎదిగిన బీజేపీ, ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల్లో కొంత డీలా పడింది. ఇప్పుడు తెలంగాణ ప్రజలు అధికార బీఆర్ఎస్ కు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌ను భావిస్తున్నారు. అందుకే నేను కూడా తెలంగాణ ప్రజల ఆలోచనలకు అనుగుణంగా వ్యవహరించాలని నిర్ణయించుకున్నాను." అని తెలిపారు. తెలంగాణలో అవినీతి అరాచక నియంతృత్వ కుటుంబ పాలనకు చరమగీతం పాడే శక్తి భారతీయ జనతా పార్టీకే ఉందని భావించి 15 నెలల క్రితం నేను మునుగోడు ఎమ్మెల్యే పదవికి, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరిన విషయం అందరికి తెలిసిందే. గత ఏడాది అక్టోబర్ నెలాఖరున మునుగోడు అసెంబ్లీకి జరిగిన ఉప ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హెూంమంత్రి అమీషా, బీజేపీ జాతీయ అధ్యక్షులు నడ్డా గారి ఆశీస్సులతో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి అధికార బీఆర్ఎస్ ను ఓడించినంత పని చేశాను. ఒక రాజకీయ యుద్ధం మాదిరిగా జరిగిన మునుగోడు ఉప ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్ 100 మంది ఎమ్మెల్యేలు మరో వంద మంది ఇతర సీనియర్ నేతలను ప్రచారంలోకి దింపి వందల కోట్లు ఖర్చు చేసి, భారీ స్థాయిలో అధికార దుర్వినియోగానికి పాల్పడినప్పటికీ స్వల్ప తేడాతో నెగ్గి, నైతికంగా ఓడింది. మునుగోడు ఉప ఎన్నికల్లో నా విజయం కోసం ప్రయత్నించిన బీజేపీ నేతలు కార్యకర్తలు శ్రేయోభిలాషులందరికీ మరోసారి ధన్యవాదాలు తెలుపుతున్నాను. అవినీతిలో మునిగిన కేసీఆర్ సర్కారుపై కేంద్రం చర్యలు తీసుకుంటుందన్న తెలంగాణ ప్రజల కోరిక నెరవేరకపోవడంతో రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు మారుతూ వచ్చాయి. అధికార బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎదగలేక పోవడంతో ఆ స్థానంలోకి కాంగ్రెస్ వచ్చింది. సకల జనుల పోరాటంతో సాకారమైన ప్రత్యేక తెలంగాణ పదేళ్ల కేసీఆర్ సర్కారు అరాచక పాలనతో గాడి తప్పింది. అధికార మార్పును కోరుకుంటున్న తెలంగాణ ప్రజల ఆలోచనలకు అనుగుణంగానే నేను కాంగ్రెస్ లో చేరాలని నిర్ణయించుకున్నాను. తప్పనిసరి పరిస్థితుల్లోనే బీజేపీకి రాజీనామా చేస్తున్నాను. మునుగోడు ఉప ఎన్నిక ద్వారా నాకు నియంతృత్వ కేసీఆర్ సర్కారుపై యుద్ధం చేసే అవకాశం కల్పించిన బీజేపీకి ధన్యవాదాలు. కేసీఆర్ సర్కారుపై యుద్ధం చేయాలని ప్రోత్సహించిన కేంద్ర మంత్రి అమిత్ షాకు నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను. తెలంగాణ ప్రజల ఆలోచనల మేరకు పార్టీ మారాలని నేను తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ పెద్దలు అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను. నాడు కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరినా, నేడు బీజేపీ నుంచి కాంగ్రెస్ లోకి మారుతున్నా లక్ష్యం మాత్రం ఒకటే. కేసీఆర్ కుటుంబ అవినీతి, అరాచక, అప్రజాస్వామిక పాలన నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయడమే. నేను ఏనాడూ పదవుల కోసం ఆరాటపడలేదు, తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణ కోసమే తపన పడ్డాను. నియంత కేసీఆర్ పాలనను అంతమొందించేందుకు కాంగ్రెస్ లో చేరుతున్న నన్ను ఆదరించాలని రాష్ట్ర ప్రజలని కోరుతున్నాను." అని రాజగోపాల్‌రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

## సంపాదకీయం

### నో సంక్షేమం... నో పథకాలూ...?

దేశంలోనూ రాష్ట్రంలోనూ అతి పెద్ద చర్చ ఒకటి ఇపుడు సాగుతోంది. పొరుగున ఉన్న శ్రీలంక దేశం ఆర్థికంగా పతనమవుతునంద నేపథ్యం ఒక వైపు ఉంది. దాంతో మన దేశంలో కూడా ఏం జరుగుతుంది అన్న ఆందోళన ఉత్కంఠ అంతటా ఉంది. దానికి కారణం చాలా చోట్ల ఆర్థిక క్రమశిక్షణ కట్టుతప్పడం. రాజకీయమే పరమావధి కావడం. వారూ వీరూ ఆ పార్టీ ఈ పార్టీ అన్న తేడా లేకుండా అందరూ తాయిలాలను జనాలకు అలవాటు చేశారు. వీటి వల్లనే తాము గెలిచామని వారు భావిస్తున్నారు. మరింతగా వాటిని పెంచి జనాలకు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రాలు అప్పుల పాలు అయినా పట్టడంలేదు. రీసెంట్ గా ఉత్తరాదిన జరిగిన ఎన్నికల్లో పంజాబ్ లో ప్రతీ కుటుంబానికి మూడు వందల యూనిట్ల దాకా విద్యుత్ ఫ్రీ అని ఆప్ లాంటి పార్టీ భారీ హామీని ఇచ్చింది. అలాగే ప్రతీ ఫ్యామిలీకి వేయి రూపాయలను నగదు బదిలీ పథకం కింద ఇచ్చింది. దానికి ఖజానా మీద పడే అదనపు బరువు అక్షరాలా ఇరవై వేల కోట్ల రూపాయలు అని చెబుతున్నారు. ఇక బీజేపీ పాలిత రాష్ట్రం యూపీలో అయితే ఈ రోజుకు వేయి రూపాయలు ఉన్న వంట గ్యాస్ ని ప్రతీ ఇంటికీ ఫ్రీగా ఇస్తామని చెప్పి మళ్లీ గెలిచింది. మిగిలిన రాష్ట్రాలూ అదే బాటన పయనిస్తున్నాయి. ఏపీలో చూస్తే సంక్షేమ రథాన్ని పరుగులు తీయిస్తోంది. ఇప్పటికి మూడేళ్ళుగా జగన్ ఈ మహా యాగాన్ని అలా నడిపిస్తున్నారు. ఆయన మరో రెండేళ్ల పాటు ఇదే తీరున సంక్షేమాన్ని కొనసాగించాల్సి ఉంది. దాని వల్ల అభివృద్ధి ఆగిపోయింది అన్నది తెలిసిందే. విపక్షాలు సంక్షేమం అన్న మాటను పక్కన పెట్టి ఏపీలో అభివృద్ధి లేదు అని విమర్శలు చేస్తున్నాయి. ఏపీ ఆర్థికంగా పతనం అయిందని మరో శ్రీలంక అని ప్రచారం చేస్తున్నాయి. దానికి కారణం సంక్షేమ పథకాలు విచ్చలవిడిగా అమలు చేయడం అని మాత్రం చెప్పలేకపోతున్నాయి. అవినీతి అంటున్నాయి లూటీ అంటున్నాయి. సరే అవన్నీ రాజకీయ పడిగట్టు మాటలుగా చూసుకున్నా వచ్చే ఎన్నికలో విపక్షాల ఎన్నికల మ్యానిఫెస్టో ఎలా ఉండబోతోంది అన్నది ఒక పెద్ద చర్చ. ముఖ్యంగా టీడీపీ విషయం తీసుకుంటే 2009 ఎన్నికల్లోనే భారీ హామీలు ఇచ్చింది. ఆల్ ఫ్రీ బాబు అని వైఎస్సార్ కూడా నాడు సెటైర్లు వేసేవారు. ఇక లక్ష కోట్ల దాకా రైతులకు వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని భారీ హామీ ఇవ్వడం వల్లనే టీడీపీ 2014లో అధికారంలోకి వచ్చింది అన్న మాట కూడా ఉంది. ఇక 2019 ఎన్నికల ముందర సామాజిక పించన్లు రెండువేలు చంద్రబాబు చేస్తే దాన్ని మూడు వేలకు పెంచుకుపోతామని జగన్ చెప్పి అధికారంలోకి వచ్చారు. ఇక వైసీపీ తీసుకువచ్చిన అమ్మ ఒడి వాలంటీర్ల వ్యవస్థ సచివాలయ వ్యవస్థ సహా వివిధ దీవెనల పథకాల మీద విపక్షాల స్టాండ్ ఏంటి అన్నది కూడా ఇపుడు చర్చకు వస్తోంది. ఏపీ నిజంగా ఏ ఒక్క హామీని ఈ రోజుకు తట్టుకునే స్థితిలో లేదు. ఎక్కడ లేని అప్పులు తెచ్చి మరీ నగదు బదిలీ పథకాలు అమలు చేస్తున్నారు. అలాంటి పరిస్థితుల్లో ఏపీలో సంక్షేమ పథకాలను తాము కొనసాగించమని అభివృద్ధి మా అజెండా అని టీడీపీ సహా ఏ పార్టీ అయినా డేరింగ్ గా జనాల్లోకి వచ్చి చెప్పగలదా అన్నదే ఇక్కడ ప్రశ్న. ఒకవేళ అలా చేస్తే కనుక జనాలు ఎలా రియాక్ట్ అవుతారు అన్నది కూడా చూడాలి. రాష్ట్రం సమాజం ఏమైపోతేనేమి మాకు తాయిలాలు దక్కాయి కదా అదే చాలు పదివేలు అనుకునే వ్యవస్థలో ఉన్నారంతా. దాంతో నో సంక్షేమం నో పథకాలు అంటే ఓట్ల పంట పండుతుందా రాజధాని కడతాం మహా నగరాలను నిర్మిస్తామని అభివృద్ధి అజెండా పెట్టుకుని వెళ్తే జనాల రియాక్షన్ ఎలా ఉంటుంది. అయితే రాజకీయ పార్టీల వరకూ చూస్తే సంక్షేమ పథకాలను కొనసాగించమని చెప్పే పరిస్థితి 2024 ఎన్నికల్లోనూ కనిపించదని అంటున్నారు. తాము అంతకంటే మెరుగ్గా మరిన్ని కొత్త పథకాలను కూడా తెచ్చి ఇస్తామనే చెబుతాయి. మరి అలాంటి హామీని ఇవ్వకుండా ఏపీ పతనం అవుతోందని చెప్పడం విమర్శలు చేయడం వల్ల ఉపయోగం ఉందా అన్నది కూడా చర్చగానే చూడాలి. ఏపీని పునర్ నిర్మిస్తామని టీడీపీ అంటోంది. దానికి ఆర్థిక క్రమశిక్షణ చాలా అవసరం. అలా చేయాలీ అంటే పందేరాలు అన్నీ బంద్ చేయాలి. అలా కొన్నేళ్ల పాటు చేస్తేనే తప్ప ఏపీ బాగుపడదు ఇది ఆర్థిక నిపుణులు చెబుతున్న మాట. మరి దీన్ని జనాల్లో ఉంచి వారిని ఒప్పించి సానుకూల ఓటుతో అధికారంలోకి వచ్చిన పార్టీదే అసలైన విజయం. మరి అలా చేయాలంటే 2024లో రాజకీయాలు చేసే నాయకత్వానికి బదులుగా రాజనీతితో నడిచే నాయకత్వం రావాలి. అది ప్రస్తుత పరిస్థితుల్లో ఆశించగలమా. చూడాలి మరి.

## అంతా బాగుండాలి.. రైతు మురవాలి



వరంగల్ : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా యాసంగి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. జిల్లాల వారీగా ఏర్పాటు చేయాల్సిన కొనుగోలు కేంద్రాల సంఖ్యను పౌరసరఫరాల శాఖ అధికారులు ఖరారు చేశారు. ఇప్పుడిప్పుడే రైతన్నలు వరి కోతలు మొదలుపెట్టారు. గత అనుభవాల దృష్ట్యా అధికారులు ముందుగానే కొనుగోలు కేంద్రాల వద్ద తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. గన్నీ సంచుల మొదలుకొంటే మంచి నీటి సౌకర్యం వరకు ఉంటే అన్నదాతలు ఇబ్బంది లేకుండా ధాన్యం విక్రయిస్తారు.

**టార్పాలిన్లు అవసరం**

రైతులు కేంద్రాలకు తీసుకొచ్చే ధాన్యం వెంటనే కాంటా కాదు. తేమ శాతం ఎక్కువ ఉంటే రెండు, మూడు రోజులు కేంద్రం వద్దే ఆరబోయాల్సి ఉంటుంది. ధాన్యంపై కప్పేందుకు కేంద్రాల నిర్వాహకులే టార్పాలిన్ కవర్లు అందించాలి. గతేడాది అనేక చోట్ల వీటిని ఇవ్వకపోవడంతో రైతన్నలే తెచ్చుకున్నారు. కొన్ని చోట్ల అకాల వర్షాలు కురిసి ధాన్యం దెబ్బతింది. ధర్మసాగర్ మండలంలో అనేక చోట్ల టార్పాలిన్లు ఇవ్వలేదు. ఈ సారి సరిపడా అందుబాటులో ఉంచాలి. గన్నీ తిప్పలుగన్నీ సంచుల కొరత వల్ల గతంలో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. చిల్లులు పడ్డవి, అనేకమార్లు వినియోగించిన నాసిరకం సంచులను నిర్వాహకులు ఇవ్వడంతో అవి ఎందుకూ పనికిరాకుండా పోయాయి. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం వంగపల్లిలో చిరిగిన గన్నీ సంచులు అందించడంతో వారం రోజులపాటు కొనుగోళ్లు నిలిచాయి. ఈసారి అలా కాకుండా కొత్త గన్నీలను ముందుగానే సరఫరా చేయాలి.

**తూకంలో తకరారు**

ఖరీఫ్ కొనుగోళ్లు, గత యాసంగి ధాన్యం కొనుగోళ్లలో అనేక కేంద్రాల్లో కాంటాల సమయంలో నిర్వాహకులు రైతులను ఇబ్బంది పెట్టారు. తాలు పేరుతో 50 కేజీలకు ఒకటి రెండు కేజీల తరుగును తీసేసి కాంటాలు వేశారు. దీంతో అన్నదాతలు చాలా మోసపోయారు. ఈ సారి తరుగు విషయంలో అధికారులు పక్కా మార్గదర్శకాలు పాటించి రైతులు నష్టపోకుండా చూడాలి.

తాగునీరు..ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతున్నాయి. కేంద్రాల వద్ద రైతుల కోసం తాగునీటి సౌకర్యం కల్పించాలి. లేదంటే గొంతెండి దాహార్తితో తీవ్ర ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. గతంలో చాలా కేంద్రాల్లో మంచినీటి సౌకర్యం లేక రైతులే సొంతంగా నీరు తెచ్చుకున్నారు. ఈ సారి అన్ని కేంద్రాల వద్ద చల్లటి నీటి వసతి కల్పించాలని కర్షకులు కోరుతున్నారు.

**రవాణాలో ఇక్కట్లు**

కేంద్రాల నుంచి ధాన్యాన్ని మిల్లులకు తరలించే విషయంలోనూ కర్షకులు గతంలో అనేక పాట్లు పడ్డారు. లారీల కొరత ఉండడంతో కాంటాలు పూర్తయినా రోజుల తరబడి కేంద్రాల వద్ద నిల్వ ఉండడం వల్ల అకాల వర్షాలు కురిసి రైతులు తీవ్ర నష్టపోయారు. దీంతో చాలా చోట్ల రైతులే సొంతంగా ట్రాక్టర్లను ఏర్పాటుచేసుకొన్నారు. బస్తాకు రూ.50 చొప్పున రవాణా ఛార్జీలు భరించడంతో ఆర్థికంగా భారమైంది. లి గతేడాది వరంగల్ జిల్లా నర్సంపేట, నల్లబెల్లి, ఖానాపూర్ మండలాల్లోని పలు కేంద్రాల్లో రైతులు రవాణా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సారి లారీలు సరిపడా లేకపోతే అధికారులే ట్రాక్టర్లను ఏర్పాటుచేసి రవాణా భారాన్ని రైతులపై పడకుండా చూడాలి.

**11 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా..**యాసంగి ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని ఇప్పటికే అధికారులు అంచనా వేశారు. ఆరు జిల్లాల్లో కలిపి 11.73 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించనున్నారు. గరిష్ఠంగా వరంగల్ జిల్లాలో 2.93 లక్షల మెట్రిక్ టన్నులు ఉంటుంది. ధాన్యాగారంగా పేరున్న ఈ జిల్లాలో 1,12,578 ఎకరాల్లో వరి సాగైనట్టు అంచనా. ఉమ్మడి జిల్లా మొత్తం కలిపి 5 లక్షల ఎకరాల వరకు సాగైంది.

**ఇబ్బందులు పడ్డాం- రావుల రామ్మోహన్‌రెడ్డి, వెల్దండ, జనగామ జిల్లా**

గతేడాది ధాన్యం కొనుగోళ్లలో అనేక ఇక్కట్లు ఎదుర్కొన్నాం. టార్పాలిన్లు లేక, గన్నీల కొరత, రవాణాకు లారీల్లేక సొంత వాహనాలు పెట్టుకున్నాం. మిల్లును జనగామ జిల్లాలో కాకుండా హనుమకొండ మడికొండ వద్ద కేటాయించారు. ఈసారి అధికారులు దృష్టి పెట్టి సమస్యలు లేకుండా చూడాలి.

**తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పా- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

ప్రతి గింజా కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అన్ని కేంద్రాల్లో మంచి నీటి వసతి నుంచి సకల ఏర్పాట్లు చేయాలని సమీక్షలో ఆదేశించాను. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తా.

**జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలు**

ములుగు 180
వరంగల్ 191
హనుమకొండ 164
జనగామ 200
భూపాలపల్లి 210
మహబూబాబాద్ 234

## ప్రయాస ప్రాంగణాలు..!



వరంగల్ : ఆర్టీసీ బస్టాండుల్లో సమస్యలు తిష్టవేస్తున్నాయి. ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. మండు వేసవిలో చల్లని తాగునీరు అందుబాటులో లేక ప్రయాణికుల గొంతులు ఎండిపోతున్నాయి. పంకాలు తిరగడం లేదు. పరిసరాల్లో శుభ్రత కానరావడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ బస్‌స్టేషన్లలో నెలకొన్న సమస్యలపై పరిశీలించింది.

**సమస్యలు అనేకం..**

వరంగల్ నుంచి హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, సూర్యాపేట, మహబూబాబాద్ తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ సర్వీసులతో పాటు లోకల్ ప్రాంతాలకు మొత్తం 650 బస్సులు నిత్యం వేలాది మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తుంటాయి. ఇంత పెద్ద బస్టాండులో రెండేళ్లుగా పంకాలు తిరగడం లేదు. కూర్చోవడానికి బెంచీలు కూడా లేకపోవడంతో.. వృద్ధులు, మహిళలు, చిన్నారులు అవస్థలు పడుతున్నారు. 25ఏళ్ల క్రితం నిర్మించిన బస్టాండు శిథిలావస్థకు చేరి అక్కడక్కడా పెచ్చులూడింది. ప్రమాదం ప్రయాణికుల చెంతనే పొంచి ఉంది. ప్రాంగణంలోని మూత్రశాలలు అపరిశుభ్రంగా ఉండడంతో.. ప్రయాణికులు దుర్వాసన భరించలేకపోతున్నారు. రాత్రి సమయంలో దీపాలు వెలుగకపోవడంతో రాత్రిపూట దొంగలు రెచ్చిపోతున్నారు. సుమారు 20 నుంచి 30 వేల మంది ప్రయాణించే బస్టాండులో ఒక్క సెక్యూరిటీ సిబ్బంది అందుబాటులో లేకపోవడం గమనార్హం.

**అలంకారప్రాయంగా నీటి కుళాయిలు**

నర్సంపేటలో మొత్తం పది ప్లాటుఫారాలుండగా కేవలం ఐదు పంకాలు బిగించారు. అందులో ఒకటి తిరగడం లేదు. మరుగుదొడ్లు, మూత్రశాలలు మూతపడి ఉన్నాయి. ప్రయాణికుల కోసం ములుగు ప్లాటుఫారం వైపు ఏర్పాటు చేసిన కుళాయిలు అలంకార ప్రాయంగా మారాయి. మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్ నిధులు మంజూరు చేయించి రూపాయికి శుద్ధిచేసిన తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన తాగునీటి ప్లాంటు మూతపడినా, తిరిగి తెరిపించలేదు.

**నిరుపయోగంగా మరుగుదొడ్లు**

వర్ధన్నపేట పట్టణంలోని ఆర్టీసీ ప్రాంగణం గుంతలమయం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు బస్టాండ్‌లోనికి వచ్చివెళ్లే సమయంలో కుదుపులతో వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రాంగణంలోని మరుగుదొడ్ల చుట్టూ చెట్లు పెరిగి నిరుపయోగంగా మారాయి. బస్టాండులో పంకాలు లేవు. ప్రాంగణంలో ప్రైవేటు వాహనాలు నిలుపుతున్నారు. సాయంత్రం ఆరు దాటిన తర్వాత బస్సులు బస్టాండులోనికి రావడంలేదని ప్రయాణికులు చెబుతున్నారు.

**ఒక్క పంకా తిరగడం లేదు..ఒ.దయాకర్, ప్రయాణికుడు**

వరంగల్ బస్టాండులో ఒక్క పంకా తిరగడం లేదు. ఉక్కపోతను తట్టుకోలేకపోతున్నాం. బస్టాండంతా అపరిశుభ్రంగా ఉంది. స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

**మరమ్మతులు పూర్తి చేస్తాం..-సురేశ్, వరంగల్ 2 డిపో మేనేజర్**

వరంగల్ బస్టాండులో మొత్తం 10 ఫ్యాన్లలో నాలుగు పనిచేయడం లేదు. త్వరలోనే వీటికి మరమ్మతులు చేయిస్తాం. ఇతరత్రా సమస్యలను త్వరలో పరిష్కరిస్తాం. బస్టాండులో ఇద్దరు సెక్యూరిటీ గార్డులను నియమించాం. రాత్రి సమయాల్లో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం. బస్టాండులో వెలగని దీపాలను గుర్తించి వాటిస్థానంలో వేరే వాటిని అమర్చుతాం.

## పంట నష్టం లెక్క తేలింది

వరంగల్ : వడగళ్ల వర్షాలతో పంటలు నష్టపోయిన ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులకు ఇదీ శుభవార్త. మార్చిలో కురిసిన ఆకాల వర్షాలకు నష్టపోయిన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర చరిత్రలో ఇప్పటి వరకు పంటలు నష్టపోయిన రైతులకు 40 రోజుల వ్యవధిలోనే పూర్తి స్థాయిలో పరిహారం అందించడం ఇదే మొదటి సారి. మార్చిలో రెండుసార్లు వర్షాలు పంటలకు నష్టం కలిగించాయి. మొదట 17వ తేదీన, రెండోసారి 21వ తేదీన వడగళ్లు పడ్డాయి. మొక్కజొన్న, వరి, మిరప, కూరగాయలు, మామిడి తదితర పంటలకు నష్టం జరిగింది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి జిల్లాలో పర్యటించారు. పంటలను పరిశీలించారు. రైతులకు భరోసా కల్పించారు. ఎకరానికి రూ.10 వేలు ఇస్తామని ప్రకటించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 74,797 రైతులకు చెందిన 85,670 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఇందుకనుగుణంగా ఎకరానికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ. 85,67,34,250 ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను నాలుగైదు రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు.

## సీఎంపీఎఫ్ ఆన్‌లైన్ సేవలు

గోదావరిఖని : బొగ్గుగని కార్మికుల భవిష్య నిధి వివరాలు ఇక నుంచి ఆన్‌లైన్‌లో చూసుకునే అవకాశం ఏర్పడనుంది. ప్రతీ సంవత్సరం ఎంత నిల్వ అవుతుందన్న వివరాలను ఆన్‌లైన్‌లోనే వివరాలు తెలుసుకునే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తమ నిల్వ వివరాలు తెలుసుకునేందుకు జాబితాలు పంపిణీ చేయాలని కార్మికులు అడిగే పరిస్థితి లేకుండా సీఎంపీఎఫ్ (కోల్ మైన్ ప్రావిడెంట్ ఫండ్) అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఈ ఏడాది మే నాటికి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసే పనిలో నిమగ్నమయ్యారు. బొగ్గుగని కార్మికులకు సంబంధించి ఏటా ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత ఆ ఏడాదికి సంబంధించిన నిల్వ ఎంత జమ చేశారన్నది వివరాలతో కూడిన జాబితాను అందిస్తారు. కరోనా కారణగా 2019, 2020లో ఆలస్యంగా పంపిణీ చేశారు. ఆ తర్వాత అందించ లేదు. దీంతో కార్మిక సంఘాల నాయకులు సీఎంపీఎఫ్ నిల్వ జాబితాలను అందించాలని డిమాండ్ చేస్తున్నారు. తాజాగా ఈ ఏడాదికి సంబంధిం




చిన సీఎంపీఎఫ్ నిల్వకు సంబంధించిన చీట్టీలు కూడా అందించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో గత ఏడాదితో పాటు ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వివరాలను సీఎంపీఎఫ్ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

**సీఎంపీఎఫ్ నంబరుతో..**

ప్రతీ కార్మికుడికి సీఎంపీఎఫ్ నంబరు ఉంటుంది. దీని ఆధారంగా ఆన్‌లైన్‌లో తమ నిల్వ నిధిని చూసుకునే అవకాశం ఇక నుంచి అందుబాటులోకి రానుంది. బొగ్గుగని కార్మికులు తమ వాటా కింద కొంత చెల్లిస్తే యాజమాన్యం అంతే మొత్తం కలిపి నిల్వ చేస్తుంది. సీఎంపీఎఫ్ ఖాతాలో జమ చేసిన నిల్వను కార్మికులు చూసుకోవడానికి చర్యలు చేపట్టారు.

**అధికారులతో మాట్లాడాం**

**వై.సత్తయ్య, బీఎంఎస్ నాయకులు**

సీఎంపీఎఫ్ నిల్వ మొత్తం చూసుకోవడానికి అధికారులతో తమ నాయకులు మాట్లాడారు. 23న రాంచిలో సీఎంపీఎఫ్ అధికారులను కలిసి నిల్వ వివరాలకు సంబంధించిన కార్మికులకు పంపిణీ చేసే జాబితాల వివరాలు వెంటనే అందించాలని చర్చించారు. ఇక నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు.

## ప్రగతి మెరిసింది.. పల్లె మురిసింది

వీర్నపల్లి : తెలంగాణ ఆవిర్భావం తర్వాత జిల్లాల పునర్విభజనలో రాజన్న సిరిసిల్ల కొత్త జిల్లాగా ఏర్పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇప్పటికే స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులకు సంబంధించిన ర్యాంకింగ్‌లో తనదైన ముద్ర వేసుకుని దేశంలోనే అగ్రగామిగా నిలుస్తున్న జిల్లా ఇదే స్ఫూర్తితో దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాల సాధనే లక్ష్యంగా పోటీ పడుతుంది. తొమ్మిది అంశాల్లో జిల్లా స్థాయిలో 27 పంచాయతీలు అవార్డులకు ఎంపికయ్యాయి. జిల్లాలో 13 మండలాల పరిధిలో 255 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అయితే 2022 సంవత్సరానికి సంబంధించి కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాల పేరిట జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. తొమ్మిది అంశాల్లో నిర్దేశించిన ప్రశ్నలు, అవసరమైన ధ్రువపత్రాలు జత చేసి అధికారులు దరఖాస్తులు సమర్పించారు. మండల స్థాయిలో ఎమ్పీడీవోలు, జిల్లా స్థాయిలో కలెక్టర్, రాష్ట్ర స్థాయిలో పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ నేతృత్వంలోని కమిటీలు నామినేషన్‌లను పరిశీలిస్తాయి. ఇతర రాష్ట్రాల్లో గ్రామీణాభివృద్ధి శాఖలో పని చేస్తున్న క్షేత్ర పరిశీలన బృందం పరిశీలించి జాతీయ పంచాయతీ పురస్కారానికి ఎంపిక చేస్తారు. సంబంధిత శాఖ అధికారుల పరిశీలన తర్వాత మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన పల్లెలను ప్రశంసా పత్రాలతో సత్కరించనుంది. మండల స్థాయిలో పురోగతి సాధించిన




పల్లెలకు ఈ నెల 24, 25 తేదీల్లో తొమ్మిది అంశాల్లో 27 అవార్డులు పంపిణీ చేసింది. కాగా జిల్లా స్థాయిలో ఆయా అంశాల్లో అవార్డులు దక్కించుకున్న పల్లెలకు నేడు మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు. పంచాయతీల మధ్య స్నేహపూర్వక పోటీతత్వాన్ని పెంచడంతో పాటు 2030 నాటికి సుస్థిర ప్రగతి లక్ష్యాలను వేగవంతం చేయడమే ఈ జాతీయ పురస్కారాల లక్ష్యం. జాతీయ స్థాయిలో సత్తా చాటిన గ్రామాలకు ఏప్రిల్ 24న పంచాయతీరాజ్ దినోత్సవం నాడు పురస్కారాలు అందజేయనున్నారు. జిల్లాకు చెందిన గ్రామాలు జాబితాల్లో ఉండాలని జిల్లావాసులు ఆకాంక్షిస్తున్నారు.

గతంలో ఇలా...జిల్లాలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లె ప్రగతి కార్యక్రమం సత్ఫలితాలను ఇచ్చింది. అభివృద్ధే లక్ష్యంగా అన్ని పంచాయతీ పాలక వర్గాలు పని చేస్తున్నాయి. దీని ఫలితంగా జిల్లా ఇప్పటికే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఫోర్ స్టార్ ర్యాంకింగ్‌లో మొదటి స్థానంలో ఉంది. జిల్లాలోని పల్లెలకు గడిచిన ఎనిమిదేళ్లుగా 11 జాతీయ అవార్డులు వరించాయి. 2015లో చందుర్తి, 2016లో బాలమల్లుపల్లి, చందుర్తి, రామన్నపల్లి, 2017లో కస్బెకట్కూర్, గోపాలరావుపల్లి, 2018లో ముష్టిపల్లి, 2021లో మోహినికుంట, హరిదాస్‌నగర్, 2022లో మండెపల్లి, మద్దికుంటలు జాతీయ స్థాయిలో మెరిశాయి. ఈ ఏడాది సైతం జాతీయ స్థాయి అవార్డుల్లో జిల్లాలోని పంచాయతీలు పురస్కారాలు సాధిస్తాయని అధికారులు భావిస్తున్నారు.

# ఎన్నికల వేళ.. ఉపాధి మేళా..!

రాజపేట : ఎన్నికల పుణ్యమా అని కొన్ని వర్గాలకు చేతినిండా పని లభిస్తోంది. ఓటర్లను ఆకట్టుకోవాలంటే పార్టీ శ్రేణులు కూడా కొంగొత్త పోకడలకు శ్రీకారం చుట్టాల్సిన పరిస్థితి అనివార్యంగా మారింది. విభిన్న తరహాలో ప్రచార సామగ్రిని సమకూర్చుకోవడం, వెంట ఉండే కార్యకర్తలు, నాయకుల బాగోగులు చూసుకోవాల్సి వస్తుంది. ఇక రాష్ట్ర నాయకుల రాకతో వీటి ఖర్చు మరింత పెరుగుతుందనే చెప్పవచ్చు. రోజుకు వేల మందికి ఉపాధి పొందుతున్నది వాస్తవం.

దర్జీలకు చేతినిండా పని


దసరా పండగకు సర్వసాధారణంగా దర్జీలకు గిరాకీ ఉండటం తెలిసిందే. ఈ సారి ఎన్నికల దసరా కావడంతో ఈ వర్గాల వారికి చేతినిండా పని లభిస్తోంది. గ్రామం మొదలుకుని రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకుల వరకు ఖద్దరు బట్టలు వేసుకోవడం ఇప్పటి రాజకీయాలకు రివాజుగా మారింది. ఓటర్లను ఆకర్షించడానికి తమ ఆహార్యంతో పెద్ద నాయకుల దృష్టిలో పడటానికి దుస్తుల అమరిక తప్పనిసరి. ఈ క్రమంలో నూతన దుస్తుల అవసరం ఉన్నందున దర్జీలు గిరాకీ కారణంగా క్షణం తీరిక లేకుండా ఉండాల్సిన పరిస్థితులున్నాయి.

డప్పు కళాకారులకు ఆదరణ

ప్రచారంలో భాగంగా డప్పు కళాకారులకు బహుళ ఆదరణ లభిస్తోంది. డప్పు చప్పుళ్లతో అభ్యర్థులు, నాయకులు ప్రదర్శన, బహిరంగ సభలు సమావేశాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ముఖ్య నాయకుల రాకకు ముందు డప్పుచప్పుళ్ల నృత్యాలు సర్వసాధారణంగా మారింది. 10 మంది ఉన్న కళాకారుల బృందం సదరు పార్టీల నుంచి, నాయకుల నుంచి రోజుకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు తీసుకుంటున్నారు.

టెంట్‌హౌజ్, కుర్చీలకు..

ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు సభలో మాట్లాడేందుకు హాజరు కావాల్సిన వారికి నీడ ఏర్పాటుతో పాటు కుర్చీలు వేయాల్సి ఉంటుంది. టెంట్‌హౌజ్‌లకు గిరాకీ పెరగనుందనే చెప్పవచ్చు. టెంట్లు, కుర్చీలను బట్టి ధర ఉంటుంది. ఎన్నికల పుణ్యమాని వీరికి గిరాకీ పెరుగుతుండటంతో నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



అద్దె వాహనాలకు డిమాండ్..

ఎన్నికల సందర్భంగా వాహనదారులకు మంచి గిరాకీ ఉంది. బరిలో దిగిన అభ్యర్థితోపాటు నాయకులు, కార్యకర్తలను గ్రామాల్లోకి తీసుకెళ్లడానికి వెంట పదుల సంఖ్యలో వాహనాలు అవసరం. సొంత వాహనం అభ్యర్థికి అవసరమైతే, మిగతా వారికి అద్దె వాహనాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రచార రథంతో పాటు బహిరంగ సభలకు జనాన్ని తరలించడానికి వాహనాలు అవసరమవుతుండటంతో ప్రైవేటు వాహన యజమానులకు గిరాకీ లభిస్తోంది. ఇదే అదనుగా వాటి అద్దె ధరలను సైతం పెంచడం విశేషం.

అల్పాహారాలు, భోజనాలు..

సభలు, సమావేశాలు, ప్రచారానికి వెళ్లే ముందు నాయకులు, కార్యకర్తలు ఉదయం అల్పాహారం తప్పనిసరి. మధ్యాహ్నం భోజనం ఏర్పాటుతో హోటళ్లకి గిరాకీ పెరిగిందనే చెప్పవచ్చు. హోటల్ యజమానులు ఆర్డర్‌పై కోరిన చోటుకు వండి తీసుకెళ్తున్న సంఘటనలూ ఉన్నాయి.

మద్యం అమ్మకాల జోరు..

దసరా పండగ సందడికి తోడు నాయకుల హడావుడితో మద్యం అమ్మకాలు జోరందుకున్నాయి. ముఖ్యంగా సభలు, సమావేశాలకు వెళ్లడమే కాకుండా పొద్దంతా ప్రచారంలో పాల్గొంటున్న నాయకులు, కార్యకర్తలు రాత్రి సమయంలో మద్యంతోపాటు పసందైన భోజనం పెట్టించాల్సిన పరిస్థితులున్నాయి. ఆయా పార్టీలు ప్రచారం ముగియగానే ఒక్కొక్కరికి రూ.500 నుంచి రూ.1000ల వరకు డబ్బును ఇస్తుండటంతో కార్యకర్తలు మద్యం దుకాణాల ముందు బారులు తీరుతున్నారు. గంటల వ్యవధిలో కేసుల కొద్ది సరకు అమ్ముడు పోతోంది.

వంట మనుషులకూ పెరిగిన గిరాకీ..

ఇతర పార్టీల కార్యకర్తలను తమ పార్టీలో చేర్చుకునే సంఘటనలు ప్రధాన పార్టీలో నిత్యం చోటు చేసుకుంటున్నాయి. దీనికితోడు ప్రచారానికి వచ్చిన కార్యకర్తలకు భోజనాలు ఏర్పాటు చేయించాల్సి ఉంటుంది. కొందరు సమావేశాల పేరున హాజరైన వారికి చికెన్, మటన్ బిర్యానీని ఏర్పాటు చేస్తుండగా మరికొందరు నాయకుల సాధారణ భోజనం అందించే ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకై ప్రత్యేకంగా వంట మనుషులను నెలవారీగా మాట్లాడుకుని భోజన వసతి ఏర్పాటు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో వంట మనుషులకు ఉపాధి లభిస్తుందంటే అతిశయోక్తి కాదు.

పెట్రోలు బంకుల్లో క్యూలు..

అభ్యర్థి ఆయన మద్దతుదారులు పదుల సంఖ్యలో కార్లు, సుమోలు వినియోగిస్తుంటారు. ద్విచక్ర వాహనాల ర్యాలీల సందర్భంలోనైతే పెట్రోలు బంకుల్లో క్యూ కట్టాల్సిందే. ద్విచక్ర వాహనంపై ప్రచారానికి వెళ్లే నాయకులు, కార్యకర్తలకు తమ వాహనాల్లో పెట్రోలు, డీజిల్ పోయించాల్సి ఉంటుంది. పెట్రోలు, డీజిల్ అమ్మకాలు విపరీతంగా పెరిగాయి.

పూలకూ పెరిగిన గిరాకీ..

ఎన్నికల ప్రచారానికి వచ్చే అభ్యర్థికి, ద్వితీయ శ్రేణి నాయకులకు పూల దండలు వేయడానికి నాయకులు, కార్యకర్తలు పోటీ పడుతుంటారు. ప్రచారంలో అభ్యర్థులపై పూల వర్షం కురిపిస్తున్నారు. పూల వ్యాపారులకు గిరాకీ పెరిగిందనే చెప్పవచ్చు. బంతిపూలు, గులాబీ దండల్లుమ్మక్లరలు కూడా పెరిగిపోయాయి. ఇవేకాక టీషర్ట్‌లకు, వాటిపై నాయకుల చిత్రాల ప్రింటింగ్, ఫ్లెక్సీలు, గోడపత్రికలు, నిత్యకూలీలకు ఉపాధి లభిస్తుందని చెప్పవచ్చు.

# చొప్పదండి.. ఉద్దండుల గడ్డ



గంగాధర : ఉమ్మడి జిల్లాకు సాగునీరు అందించే గాయత్రి పంపుహౌస్‌లు, ఎస్సారెస్పీ వరదకాలువ, ఎల్లంపల్లి ప్రాజెక్టు, మధ్యమానేరు జలాశయాలు.. భక్తుల కోర్కెలు తీర్చే కొండగట్టు అంజన్న.. తొలి తెలుగు కందపద్యం, జైన శాసనాలు నియోజకవర్గం ప్రత్యేకం. ఇక్కడ విద్యానిధిగా పేరొందిన విద్యాసంస్థలు ఉన్నాయి. దేశవిదేశాలకు గ్రానైట్ రాయిని ఎగుమతి చేస్తుంది ఇక్కడి నుంచే.. వీటన్నింటికీ కేంద్రబిందువుగా ఉన్న చొప్పదండి నియోజకవర్గానికి ఏడు దశాబ్దాల చరిత్ర ఉంది. అనేక మంది రాజకీయ ఉద్ధండులను శాసనసభకు పంపిన చొప్పదండి నియోజకవర్గంపై ' ప్రత్యేక కథనం. హ్యాట్రిక్ సాధించిన వారిలో న్యాలకొండ రాంకిషన్‌రావు (తెదేపా) 1985, 1985, 1994లో కాంగ్రెస్ అభ్యర్థులపై గెలుపొందారు. 1997-98లో రెండేళ్లపాటు రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో పని చేశారు.

రాజకీయ దిగ్గజాల అడ్డా..

పూర్తిగా గ్రామీణ ప్రాంత నేపథ్యమే అయినప్పటికీ ఈ నియోజకవర్గం నుంచి ఎందరో రాజకీయ దిగ్గజాలు కీలకపాత్ర పోషించారు. కాంగ్రెస్ కురువృద్ధుడు ఎం.సత్యనారాయణరావు (ఎమ్మెస్సార్) స్వగ్రామం రామడుగు మండలం వెదిర కాగా దత్తత గ్రామం గంగాధర మండలం నారాయణపూర్. కరీంనగర్ ఎమ్మెల్యేగా పని చేసిన వెలిచాల జగపతిరావు స్వగ్రామం రామడుగు మండలం గుండి. గంగాధర మండలం సర్వారెడ్డిపల్లి గ్రామానికి చెందిన జువ్వాడి రమాపతిరావు కరీంనగర్ ఎంపీగా రెండు పర్యాయాలు కొనసాగారు. ప్రధానంగా వ్యవసాయానికి పుట్టినిల్లుగా ఉన్న నియోజకవర్గంలో సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్నాయి.

గంగాధర మండలం కురిక్యాల బొమ్మలమ్మ గుట్ట జైనశాసనాలకు నిలయమైంది. ఒద్యారం, గట్టుబూత్కూర్, కోట్ల నర్సింహులపల్లి, ముప్పిడిపల్లి గ్రామాల్లో గ్రానైట్ పరిశ్రమలు, క్వారీలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఇక్కడి నుంచి గ్రానైట్ రాయి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. కొడిమ్యాల మండలంలో జేఎన్టీయూ, చొప్పదండి మండలం ఆర్నకొండలో జవహర్ నవోదయ విద్యాలయం, రుక్మాపూర్, తాటిపల్లి, గంగాధర, బోయినపల్లి మండలాల్లో గురుకులాలతో వేలాది మంది విద్యార్థులకు ఉచిత విద్య అందుతోంది. బతుకమ్మ చీరలు, ఇతర దుస్తుల తయారీతో కార్మిక క్షేత్రం గర్శకుర్తి మినీ సిరిసిల్లగా వెలుగొందుతుంది. ఇక్కడ చదివిన వేలాది మంది ఉన్నత విద్య, ఉద్యోగాలకు అమెరికా, కెనడా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, గల్ఫ్ దేశాలకు వెళ్లి స్థిరపడ్డారు.

1957లో ఏర్పడిన ఈ నియోజకవర్గానికి ఇప్పటివరకు 12 సార్లు ఎన్నికలు జరిగాయి. ఇప్పుడు జరగబోయేది 13వ ఎన్నిక. మొట్టమొదట ఈ స్థానానికి పీడీఎఫ్ ప్రాతినిధ్యం వహించింది. ఆ తర్వాత కాంగ్రెస్ మూడుసార్లు, తెదేపా ఆరు సార్లు, తెరాస (ప్రస్తుత భారాస) వరుసగా రెండుసార్లు విజయం సాధించింది. తెదేపా ఆవిర్భావం తర్వాత పూర్తిగా ఆ పార్టీ అభ్యర్థులకు ఈ నియోజకవర్గం కంచుకోటగా మారింది. 1983 నుంచి వరుసగా నాలుగు పర్యాయాలు గుర్రం మాధవరెడ్డి, న్యాలకొండ రాంకిషన్‌రావు విజయం సాధించారు. 1999లో మాత్రమే కాంగ్రెస్ అభ్యర్థి సత్యనారాయణ గౌడ్ గెలిచారు. ఆ తర్వాత ఇక్కడి నుంచి 2004లో సాన మారుతి, 2009 ఎన్నికల్లో సుద్దాల దేవయ్య తెదేపా తరపున విజయం సాధించారు. అనంతరం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో జరిగిన రెండు ఎన్నికల్లో వరుసగా బొడిగ శోభ, ప్రస్తుత ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విజయఢంకా మోగించారు.

ప్రస్తుత నియోజకవర్గ పరిధి..

శాసనసభ స్థానాల పునర్విభజన అనంతరం కొన్ని మండలాలు విడిపోయినప్పటికీ బోయినపల్లి (రాజన్న సిరిసిల్ల జిల్లా), మల్యాల, కొడిమ్యాల (జగిత్యాల జిల్లా) మండలాలను కలుపుకొని గంగాధర, రామడుగు, చొప్పదండి (కరీంనగర్ జిల్లా) మండలాలతో నియోజకవర్గం కొనసాగుతోంది.



# అమెరికా ఆఫరిచ్చింది.. కానీ..!

తమ దేశం అణుపరీక్షలు చేయకపోతే 5 బిలియన్ డాలర్లు ఇస్తామని అమెరికా చెప్పిందని పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ వెల్లడించారు. కొన్నేళ్ల ప్రవాసం తర్వాత పాక్‌లో అడుగుపెట్టిన తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. స్థానికంగా ఏర్పాటు చేసిన ఓ ర్యాలీలో మాట్లాడుతూ తన హయాంలో భారత్ అణుపరీక్షలకు గట్టిగా జవాబిచ్చామని నవాజ్ చెప్పారు. "చాలా రోజుల తర్వాత మిమ్మల్ని కలిశాను. కానీ, మీతో నా బంధం చెక్కుచెదరకుండా అలానే ఉంది. 1999లో పాక్‌కు ఐదు బిలియన్ డాలర్ల ఆఫర్‌ను నాటి అమెరికా అధ్యక్షుడు క్లింటన్ ఇచ్చారు.

నాకు కూడా ఒక బిలియన్ డాలర్లు ఇస్తానని ఉండొచ్చు. కానీ, నేను పాకిస్థాన్‌లో పుట్టాను. పాకిస్థాన్‌కు అపకారం చేసే పనిని ఎప్పటికీ చేయను. నా స్థానంలో మరెవరైనా ఉంటే ఇలానే స్పందించేవారా..? నేను ఎవరిని (ఇమ్రాన్ ఖాన్) అంటున్నానో మీకు తెలుసు. మనం అణు పరీక్షలు చేశాం. భారత్ అణు పరీక్షలకు గట్టిగా జవాబిచ్చాం" అని అన్నారు. దాదాపు 60 నిమిషాలపాటు మాట్లాడిన నవాజ్.. పలుమార్లు ఇమ్రాన్ ఖాన్‌ను తప్పుపట్టారు. పాక్ నుంచి తనను వేరు చేసింది ఇమ్రానే అని ఆరోపించారు. తాను పాక్‌ను అణుశక్తిగా నిలబెట్టానని చెప్పారు. ప్రస్తుత పాక్ ఆర్థిక పరిస్థితిపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశాన్ని అభివృద్ధి మార్గం నుంచి పక్కకు తప్పించారని నవాజ్ పేర్కొన్నారు. బ్రిటన్‌లో నాలుగేళ్ల ప్రవాస జీవితాన్ని ముగించుకొని పాక్ మాజీ ప్రధాని ఎట్టకేలకు నిన్న స్వదేశంలో అడుగుపెట్టారు. శుక్రవారమే లండన్ నుంచి దుబాయి చేరుకున్న ఈ పాకిస్థాన్ ముస్లిం లీగ్ (ఎన్) అధినేత.. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో శనివారం ఇస్లామాబాద్ విమానాశ్రయంలో దిగారు. పార్టీ నేతలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ జైల్లో ఉన్న సమయంలో మరో మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ దేశంలో అడుగుపెట్టడాన్ని కీలక పరిణామంగా విశ్లేషకులు భావిస్తున్నారు. త్వరలో పాకిస్థాన్‌కు సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో సైన్యం అండతోనే నవాజ్ రంగంలోకి దిగారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

# సహకార ప్రస్థానం

కామారెడ్డి : నాయకులకు పదవులే అలంకరణ. వాటితోనే ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. రాజకీయాల్లో కొందరు నేతలు కింది స్థాయి పదవులు చేపట్టి క్రమంగా ఎదుగుతారు. జిల్లాలోనూ కిందిస్థాయి పదవులు చేపట్టి ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా గుర్తింపు తెచ్చుకున్న నేతలు ఉన్నారు. ఈ ముగ్గురు నేతలు ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులుగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు.

పోచారం.. నేరేళ్ల, గంప.. ఈ ముగ్గురు నేతల రాజకీయ ప్రస్థానం ప్రాథమిక సహకార సంఘ అధ్యక్షులుగానే ప్రారంభమైంది. 35 ఏళ్ల కిందటే వీరు తెదేపాలో చేరి క్రమంగా ఎదిగారు. 1987లో జరిగిన నిజామాబాద్ ప్రాథమిక సహకార సంఘం ఎన్నికల్లో వీరు సహకార సంఘం ఛైర్మన్లుగా ఎన్నికయ్యారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి బుడిమి సహకార సంఘ అధ్యక్షుడిగా ఎన్నికై నిజామాబాద్ డీసీసీబీ ఛైర్మన్‌గా పనిచేశారు. భిక్కనూరు మండలం బస్వాపూర్ సహకార సంఘం అధ్యక్షుడిగా గంప గోవర్ధన్ ఎన్నికయ్యారు. గాంధారి ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడిగా నేరేళ్ల ఆంజనేయులను ఎన్నుకున్నారు. 1989 ఎన్నికల్లో నేరేళ్ల ఆంజనేయులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత మరో రెండు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రభుత్వ విప్‌గా, మంత్రిగా పనిచేశారు. 1994 సాధారణ ఎన్నికల్లో బాన్సువాడ నియోజకవర్గం నుంచి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కామారెడ్డి నియోజకవర్గం నుంచి గంప గోవర్ధన్ తెదేపా నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి చంద్రబాబు, కేసీఆర్ మంత్రివర్గాల్లో మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం స్పీకర్‌గా కొనసాగుతున్నారు. గంప గోవర్ధన్ ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రభుత్వ విప్‌గా పనిచేస్తున్నారు.

# పోలింగ్‌కు సంసిద్ధతపై దృష్టి..!

మహబూబ్‌నగర్: పాలమూరులోని 13 నియోజకవర్గాల్లో ఎన్నికల రోజు ఓటింగ్‌లో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం దృష్టి పెట్టింది. ఓటింగ్‌లో కీలక పాత్ర పోషించే ఈవీఎంపై ప్రధానంగా దృష్టి సారిస్తోంది. బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌లకు సంబంధించి మొదటి విడత మొదటి ర్యాండమైజేషన్ పూర్తయింది. వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారులు ఈ ప్రక్రియను పూర్తి చేశారు. దీనికి సంబంధించిన జాబితాను కూడా రాజకీయ పార్టీలకు అందించారు. ఉమ్మడి జిల్లాకు మొత్తం 6,289 బ్యాలెట్ యూనిట్లు, 4,820 కంట్రోల్ యూనిట్లు, 4,845 వీవీప్యాట్లను కేటాయించారు. పోలింగ్ రోజు నిర్వహించే ప్రక్రియకు సంబంధించి కొన్ని ఈవీఎంలకు మొదటి దశ రాండమైజేషన్ పూర్తిగా కాగా త్వరలో మిగతా వాటికి పూర్తి చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట కలెక్టర్లు రవినాయక్, క్రాంతి, ఉదయ్‌కుమార్, తేజస్ నంద్లాల్, శ్రీహర్ష సమక్షంలో ఈ దశను పూర్తి చేశారు.

మొత్తం 3,021 పోలింగ్ కేంద్రాల్లో..

పాలమూరు జిల్లాలో మొత్తం 3,021 పోలింగ్ కేంద్రాలున్నాయి. వీటిలో మొత్తం 12,400 మంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు. సుమారు 3వేల మంది ప్రిసైడింగ్ అధికారులు కాగా మిగతా వారు ఎన్నికల సిబ్బంది. ఇప్పటికే జిల్లాలో ప్రిసైడింగ్ అధికారులకు ఈవీఎంలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. మాక్ పోలింగ్ నిర్వహణ, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌లను పోలింగ్ రోజు ఎలా ఉపయోగించాలనే దానిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పోలింగ్ రోజు కేంద్రాల్లో ఎలాంటి నిబంధనలు పాటించాలనే దానిపై శిక్షణ కార్యక్రమాల్లో పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్ అధికారికి మాత్రమే చరవాణి ఉపయోగించుకునే అవకాశం ఉంది. ఈ ఫోన్‌ను ఆ అధికారి సైలెంట్‌లో ఉంచుకోవాలి. ఇప్పటికే మొదటిస్థాయి శిక్షణ అయిపోయింది. మరో మూడు స్థాయిల్లో వీరికి శిక్షణ ఉంటుంది. కలెక్టర్లు ఆ శిక్షణలో పాల్గొని పోలింగ్ రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పూర్తి స్థాయిలో వివరిస్తున్నారు. దీనికి సంబంధించిన హ్యాండ్ బుక్‌ను కూడా అందిస్తున్నారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్లను ఐదు జిల్లా కేంద్రాల్లో ఉన్న స్ట్రాంగ్ రూముల్లో భద్రపరుస్తున్నారు. పోలింగ్ రోజు ప్రతి రెండు గంటలకు ఒక్కసారి పోలింగ్ శాతాన్ని ప్రకటించాలి. దీనికి సంబంధించిన వివరాలను కలెక్టర్లు వివరిస్తున్నారు.

స్ట్రాంగ్ గదుల వద్ద భద్రత..ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రాల్లో ఉన్న స్ట్రాంగ్‌రూం వద్ద భద్రతను మరింత పెంచారు. ఇక్కడే ఈవీఎంలను భద్రపరిచారు. వివిధ దశల్లో వీటికి ర్యాండమైజేషన్ పూర్తి చేస్తారు. పోలింగ్ రోజు ఎన్నికలకు సంబంధించిన ఈ పోలింగ్ సామగ్రిని సంబంధిత నియోజకవర్గ కేంద్రంలోని స్ట్రాంగ్‌రూమ్ నుంచి సెక్టోరియల్, ప్రిసైడింగ్ అధికారులకు పంపిణీ చేస్తారు. పోలింగ్ కేంద్రాల్లో విధులను నిర్వహించే అధికారులు, సిబ్బందితో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల ద్వారా ఎన్నికల సామగ్రిని తరలిస్తారు. పోలింగ్ రోజు ఉదయం 6 గంటలకు ఈవీఎంల పనితీరును తెలుసుకునేందుకు ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించనున్నారు. అనంతరం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమవుతోంది. సాయంత్రం అయిదు గంటలకు ముగుస్తుంది. పోలింగ్ అనంతరం భద్రత మధ్య జిల్లా కేంద్రాల్లో కౌంటింగ్ ప్రదేశాలు గుర్తించిన ప్రాంతాల్లో స్ట్రాంగ్ గదులు ఏర్పాటు చేసి అక్కడ భద్రపరుస్తారు. వీటికి సంబంధించిన శిక్షణ కార్యక్రమాలను ఎన్నికల అధికారులు పాలమూరు జిల్లాలో అందిస్తున్నారు.

# చర్విత చరణం.. హామీలకే పరిమితం

గద్వాల : ఎన్నికలు వచ్చినప్పుడల్లా హామీలు ఇవ్వడానికి.. ఓట్లు దండుకోవడానికి మాత్రమే ఆ సమస్యలు పరిమితమైపోతున్నాయి. ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోకపోవడంతో ప్రజల ఇబ్బందులు తీరడంలేదు. తాము ఇంతగా సతమతమవుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మరోసారి ఎన్నికలు రావడంతో తిరిగి నాయకులు అవే హామీలు ఇచ్చేస్తున్నారు. ఈ సారైనా పరిష్కరిస్తారా.? సారూ అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్న పరిస్థితులు కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో ఇలాంటి సమస్యలు కొన్నింటిని పరిశీలిస్తే...

వంతెనలు, రహదారులు: జిల్లాలోని ప్రజల రవాణా సౌకర్యం కోసం అవసరమైన వంతెనలు, రహదారుల నిర్మాణాలు పూర్తికాక ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లుగా అడుగున్నా వారి నాయకుల హామీ నెరవేరడం లేదు. గద్వాల మండలంలోని గుర్రంగడ్డ వంతెన నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చినా.. ఇంకా పనులు పిల్లర్ల దశలోనే నత్తనడకన సాగుతున్నాయి. రూ.12 కోట్లు మంజూరు చేసినా, దాదాపు నాలుగేళ్లుగా పనులు పూర్తి కాలేదు. ఇటిక్యాల మండలంలోని ఆర్.గార్లపాడు గ్రామానికి వంతెన నిర్మాణానికి రూ.2.5 కోట్లు మంజూరైనా ఏడేళ్లుగా పూర్తి కాలేదు. వంతెన లేకపోవడంతో ఇటిక్యాల, మానవపాడు మండలాలకు చెందిన ఏడు గ్రామాల ప్రజలు అవస్థలు వర్ణనాతీతం.

కేటీదొడ్డి మండలంలో గువ్వలదిన్నె తాండ నుంచి పూజారి తాండ వరకు బీటీ రహదారి నిర్మాణానికి గత ఎన్నికలకు ముందు శంకుస్థాపన చేసినా ఇప్పటి వరకు పూర్తి కాలేదు. నాలుగు గ్రామాలు రహదారి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ః మల్దకల్ మండలంలోని నీలిపల్లి, అమరవాయి రహదారి నిర్మాణం అసంపూర్తిగా ఉంది. సాతర్ల, మల్లెందొడ్డి రోడ్డు వేయిస్తామని చెప్పినా నోచుకోలేదు.

అయిజ పట్టణం నుంచి పులికల్ రోడ్డు రెండు ఎన్నికల నుంచి అసంపూర్తిగానే మారింది. ప్రతి ఎన్నికలో హామీ ఇస్తున్నా కంకర రోడ్డుపై ప్రయాణిస్తున్న ప్రజల తిప్పలు మాత్రం తీరడం లేదు. అలాగే అయిజ - ఎరిగేర అంతర్రాష్ట్ర గుంతల రహదారి బాగు పడటం లేదు.

ప్రశ్నార్థకంగా సాగునీరు

ఆర్డీఎస్ చివరి ఆయకట్టుకు నీరందిస్తామంటూ ప్రతి ఎన్నికలో పార్టీలకు ఒక అస్త్రంగా ఉపయోగడుతోందే తప్ప, అన్నదాతలకు మేలు మాత్రం చేయడం లేదు. రూ.68 కోట్లతో 40 డిస్ట్రిబ్యూటర్ల వరకు ఆధునికీకరణ చేపట్టాల్సి ఉండగా, అది నెరవేరక వేలాది ఎకరాల చివరి ఆయకట్టుకు నీరు కలగానే మారింది.

రాజోలి మండలంలోని తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం నాయకులకు ఎన్నికల హామీగానే ఉపయోగపడుతోంది. పదేళ్ల కిందట ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ పథకాన్ని రూ.380 కోట్లతో నిర్మించినా, మల్లమ్మకుంట, జూలకల్, వల్లూరు రిజర్వాయర్ల నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో రైతులు సాగునీరు అందక రెండు పంటల సాగు చేయలేని పరిస్థితి నెలకొంది.

ఇటిక్యాల మండల పరిధిలో నెట్టెంపాడు ప్రాజెక్టు కింద 99, 100 ప్యాకేజీ పనులు పూర్తిచేసి సాగునీరు అందిస్తామని చెప్పినా అమలుకు నోచుకోలేదు. దీంతో ఆయకట్టు రైతులు సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు.

కలగానే బస్ డిపోఅలంపూర్ చౌరస్తాలో మినీ బస్‌డిపో ఏర్పాటు కలగానే మిగిలింది. ఎన్నికలు వచ్చినప్పుడల్లా హామీలు ఇస్తున్నా.. డిపో ఏర్పాటుకు మాత్రం అడుగులు పడటం లేదు. డిపో లేకపోవడం, సరిహద్దు నియోజకవర్గంకావడం గ్రామాలకు సరిపడా బస్సులు లేవు.

# ఆసరాకు ఎదురు చూపులు..!

ములుగు : దసరా పండగ సమీపిస్తుండటంతో.. పింఛన్‌దారుల్లో ఆందోళన మొదలైంది. ఆసరా పింఛన్ పథకం ప్రారంభంలో ప్రతి నెలా మొదటి తేదీన పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ.. అది అమలు కావడం లేదు. సెప్టెంబర్‌కు సంబంధించిన ఆసరా ఇంత వరకు రాకపోవడంతో.. దానిపై ఆధారపడుతున్న వారు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రతి రోజు వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు తదితర ఆసరా లబ్ధిదారులు తపాలా కార్యాలయానికి వెళ్లి పింఛన్ ఇస్తున్నారా? ఎప్పుడిస్తారని అడుగుతున్నారు. చెల్లింపులపై వారికి కూడా సరైన స్పష్టత లేకపోవడంతో సమాధానం చెప్పలేక సతమతమవుతున్నారు.

గందరగోళంలో లబ్ధిదారులు

తెలంగాణ రాష్ట్రంలో సద్దుల బతుకమ్మ, దసరా పండగలు ఎంతో ముఖ్యమైనవి. కొత్త దుస్తులు కొనుగోలు చేయడంతో పాటు పండగ సరకులు కొనుగోలు చేయడం ఆనవాయితీ. ఈ అవసరాలు డబ్బుతో ముడిపడి ఉన్నాయి. పండగలకు రెండు రోజులే సమయం ఉండటంతో.. పింఛన్ వస్తుందా, లేదా అనే గందరగోళంలో ఉన్నారు. కొంత మంది అప్పులు చేస్తున్నారు. శనివారం ఒక్క రోజు ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగుతాయి. ఆది, సోమవారాలు సద్దుల బతుకమ్మ, దసరా సెలవులు కావడంతో.. శనివారం పింఛన్ అందకపోతే మంగళవారం వరకు పొందే అవకాశం లేదు.

జిల్లాలో 39,905 మంది

జిల్లాలో మొత్తం 39,905 మంది లబ్ధిదారులున్నారు. ఇందులో వృద్ధులు, 16,576, దివ్యాంగులు 4,097, వితంతువులు 17,109, చేనేత కార్మికులు 214, ఒంటరి మహిళలు 1,550, గీత కార్మికులు 231, బీడీ%ు% కార్మికులు 92, ఫైలేరియా 24, డయాలసిస్ 12 మంది ఉన్నారు. వీరికి ప్రతి నెలా మొత్తం రూ.9.58 కోట్లు పంపిణీ చేస్తున్నారు. లబ్ధిదారులంతా తపాలా కార్యాలయానికి వెళ్లి పింఛన్ తీసుకుంటున్నారు. నగదు పంపిణీ చేసే వ్యక్తిని తరచూ అడుగుతుండటంతో.. వారు సరైన సమాధానం లేక చెప్పలేకపోతున్నారు.

అనేక సందేహాలు

ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత పింఛన్ డబ్బుల పంపిణీలో జాప్యం జరుగుతుండడంతో పలువురికి సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పింఛన్ సొమ్ము విడుదలకు ఎన్నికల కోడ్‌కు ఏమైనా సంబంధం ఉంటుందా? ఎన్నికలు పూర్తయ్యేంత వరకు పింఛన్ రాదా? ఆ తర్వాత అన్ని నెలలు కలిపి ఒకేసారి ఇస్తారా? ఈ రెండు నెలలు ఇవ్వకుండా ఉంటారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

పండగ ఎలా గడుస్తుందో..– జి. చిన్నలక్ష్మి, ఏటూరునాగారం

నాకు ఐదుగురు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు. అందరికి పెళ్లిళ్లు చేశా. నా కూతుళ్లు, కొడుకులు వాని పిల్లలతో కలిసి మనవలు, మనవరాళ్లు ఎవరో ఒకరో, ఇద్దరో నా ఇంటికి వస్తారు. ఈ నెల ఇంత వరకు పింఛన్ ఇవ్వలేదు. ఈ దసరా పండగ ఎలా గడుస్తుందోనని ఆందోళనగా ఉంది.

ఇబ్బంది పడుతున్నా..– సీహెచ్.జంపయ్య, ఏటూరునాగారం

నేను నా పిల్లలతోనే కలిసి ఉంటున్నా.. నన్ను కొడుకులు బాగానే చూసుకుంటున్నా.. నా వ్యక్తిగత ఖర్చుల కోసం పింఛన్ ఉపయోగపడుతుంది. డబ్బులు అవసరమైతే ఎవరినీ అడగను. నాకు వచ్చిన 'ఆసరా'తోనే సర్దుకుంటాను. ఆలస్యం కావడంతో చాలా ఇబ్బంది పడుతున్నా.

ప్రభుత్వానికి నివేదించాం..– నాగపద్మజ, డీఆర్‌డీఏ పీడీ

జిల్లాలోని పింఛన్‌దారుల వివరాలను ప్రభుత్వానికి నివేదించారు. ఎంత సొమ్ము అవసరం అనేది తెలియజేశ్శా. రెండు రోజుల్లో నిధులు తపాలా కార్యాలయాలకు జమయ్యే అవకాశాలు ఉన్నాయి.

# విజిలేస్తున్నారు..

మహబూబాబాద్ : ఎన్నికలు సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు, వ్యవస్థలో జవాబుదారీతనం పెంచేందుకు ఎన్నికల సంఘం సి- విజిల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పౌరులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఎన్నికల వేళ జరిగే అక్రమాలపై విజిలేస్తున్నారు. అది ఎన్నికల సంఘానికి చేరుతోంది. అధికారులు నిమిషాల వ్యవధిలోనే ఘటనా ప్రదేశానికి చేరుకొని చర్యలు తీసుకుంటున్నారు.ఫిర్యాదు చేసిన అయిదు నిమిషాల్లో జిల్లా ఎన్నికల అధికారి నియంత్రణలోని మానిటరింగ్ సెల్‌కు వెళ్తుంది. అక్కడి నుంచి ఐదు నిమిషాల్లో క్షేత్ర పరిశీలనలోని ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు చేరుతుంది. సదరు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేస్తారు. ఆ నివేదికను 30 నిమిషాల్లో రిటర్నింగ్ అధికారికి పంపుతారు. రిటర్నింగ్ అధికారి 50 నిమిషాల్లో పరిశీలిస్తారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. కోడ్ ఉల్లంఘన జరగలేదని తేటలితే ఆ ఫిర్యాదును యాప్ నుంచి తొలగిస్తారు.

డౌన్‌లోడ్ చేసుకుందాం

నిఘా నేత్రంగా ఉపయోగపడే సి-విజిల్ యాప్‌ను స్మార్ట్ ఫోనులోని గూగుల్, యాపిల్ ప్లేస్టోర్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మీ పరిసర ప్రాంతాల్లో నేతలు ప్రలోభాలకు గురి చేసినా, తాయిలాలు ఇచ్చినా వెంటనే ఫొటో, వీడియో తీసి.. యాప్‌లో అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది.

గోప్యంగా ఉంచుతారు..

ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బు, మద్యం, కానుకలను పంపిణీ చేస్తుంటారు. కొన్ని సందర్భాల్లో భయపెడుతారు. మారణాయుధాలతో సంచరించటం, తప్పుడు వార్తలు, ఓటర్ల రవాణా, మత విద్వేషపూరిత ప్రసంగాలు చేయడం ఎన్నికల నియమావళిని అతిక్రమించడమే. వీటిపై ప్రతి పౌరుడు సి- విజిల్ యాప్ ద్వారా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యం గా ఉంచుతారు.

స్పందిస్తున్నారు..

కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి సి-విజిల్‌కు ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల నుంచి మంచి స్పందన వస్తోంది. గురువారం వరకు 70 ఫిర్యాదులు వచ్చాయి. ఎక్కువగా పాలకుర్తి, జనగామ, నర్సంపేట, భూపాలపల్లి నియోజకవర్గాల నుంచి అందాయి. అవి రాగానే సంబంధిత బృందాలు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిష్కరిస్తున్నారు.

ఉదాహరణలు కొన్ని..

డోర్నకల్ నియోజకవర్గం దంతాలపల్లిలో వాహనాల తనిఖీ నామమాత్రంగా జరుగుతుందని పారదర్శకంగా చేపట్టాలంటూ ఒకరు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలంటూ ఆదేశాలు జారీ చేశారు.మరిపెడ పట్టణంలోని ప్రధాన రహదారిలోని విభాగిని మధ్యలో ఏర్పాటు చేసిన స్తంభానికి రాజకీయ పార్టీ జెండా ఉండటంతో ఓ వ్యక్తి ఫొటోతో ఫిర్యాదు చేశారు. అధికారులు జెండాను తొలగింపజేశారు.వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలో అనుమతి లేకుండా బ్యానర్ ఉందంటూ ఆ ప్రాంతంలోని ఒకరు ఫిర్యాదు చేయడంతో వెంటనే దానిని తొలగించారు.

# రామయ్యకు సౌర వెలుగులు



భద్రాచలం : దేవాదాయ శాఖ చరిత్రలో పెద్ద ఆలయాలకు సోలార్ సదుపాయాన్ని కల్పించిన ఘనత భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి దక్కింది. తొలిసారిగా సౌరశక్తిని అందుకున్న 6-ఏ దేవస్థానంగా ఇది గుర్తింపు పొందింది ఈ తరహా సేవలు ఇక్కడ మొదలయ్యాయి. ఈఓ రమాదేవి పూజలు చేసి సోలార్ విద్యుత్తు విభాగాన్ని ప్రారంభించారు. ఇక నుంచి దాదాపు 30 శాతం విద్యుత్తు కోసం దీనిపై ఆధారపడనున్నారు. సన్ టెక్నాలజీ ప్రైవేటు లిమిటెడ్‌తో దేవస్థానం ఒప్పందం కుదుర్చుకుంది. ఆ సంస్థ సుమారు రూ.2 కోట్లను వెచ్చించి 500 కేవీ సోలార్ విద్యుత్తు విభాగాన్ని ఏర్పాటు చేస్తుంది. ఇందులో తొలి విడతగా 75 కేవీ యూనిట్ పనులు పూర్తి కావడంతో దసరాకు ముందే దీన్ని ఆరంభించారు. ప్రస్తుతానికి రెండు కాటేజీలకు ఈ వెలుగులు అందించారు. మిగతా 425 కేవీ సౌర విద్యుత్తును ముక్కోటి ఏకాదశికి అందుబాటులో తేవాలని నిర్ణయించారు.ఏఈఓ శ్రావణ్‌కుమార్, ఈఈ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

రామాలయానికి ఆదా.. విద్యుత్తు సంస్థ టారిఫ్ ప్రకారం యూనిట్‌కు రూ.5 నుంచి రూ.9 వరకు దేవస్థానం చెల్లిస్తోంది. ఇలా ఏడాదికి రూ.6 లక్షలకుపైగా బిల్లులు వస్తున్నాయి. ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో తీసుకున్న నిర్ణయంతో దేవాదాయ శాఖకు విద్యుత్తు బిల్లుల భారం కొంత తగ్గింది. సత్రాలు, కాటేజీలకు కాకుండా దేవస్థానాలకు మాత్రమే రాయితీ వర్తింపజేస్తోంది. రూ.9 వరకు ఉండే విద్యుత్తు యూనిట్ ధర కోవెలకు రూ.5గా నిర్ణయించారు. ఇలా ఏడాదికి రూ.లక్షకు పైగా రాయితీ లభించనుంది. ఇప్పుడు సౌర విద్యుత్తు ఉపయోగంలోకి రావడంతో నెలకు రూ.1.50 లక్షలకు పైగా బిల్లు ఆదా కానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఏడాదికి రూ.18 లక్షలకు పైగా బిల్లు తగ్గనుందని చెబుతున్నారు. సోలార్‌ను అందించే సంస్థ యూనిట్‌కు రూ.4.90 నుంచి రూ.5.25 వరకు ఛార్జ్ చేస్తున్నట్లు తెలిసింది. దీన్ని 1,000 కేవీ యూనిట్‌గా విస్తరిస్తే బిల్లులో ఇంకా మిగులు ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. నిర్వహణలో లోపాలు తలెత్తకుండా చూడాల్సి ఉంది.

భక్తుల అవసరాలను గుర్తించి.. రామాలయ అభివృద్ధికి దాతలపైనే ఆధారపడాల్సి వస్తోంది. కొన్ని సత్రాలు, కుటీరాలు ఈ మధ్య ఉపయోగంలోకి వచ్చాయి. ఇంకా కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. పదేళ్ల కిందట లెక్కల ప్రకారం సంవత్సరానికి 20 లక్షల మంది భక్తులు ఇక్కడకు వచ్చే వారని అంచనా. ఇటీవల నిర్వహించిన సర్వే ప్రకారం సంవత్సరానికి 30 లక్షల మంది వస్తున్నట్లు అంచనా. క్రమంగా ఆధ్యాత్మికత వైపు జనం దృష్టి సారిస్తుండటంతో భక్తుల రాక పెరుగుతోంది. దీన్ని గుర్తించి అదనపు సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టిసారించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ.100 కోట్లు వస్తే కొత్త నిర్మాణాలకు ఆస్కారం ఉంటుంది. టూరిజం విభాగం ద్వారా రూ.42 కోట్లతో పర్యాటక పనులు మొదలయ్యాయి.

# వసతులతోనే వన్నె!



భద్రాచలం : విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలంటే బడి వాతావరణం ఆకట్టుకునేలా ఉండాలి.. అలాగే ఓటరు వ్యయప్రయాసలకు గురికాకుండా తన ఓటుహక్కు వినియోగించుకోవాలంటే పోలింగ్ కేంద్రంలో కనీస వసతులుండాలి.. అయిదేళ్ల పాలనను నిర్దేశించే ఓటింగ్ కేంద్రాల్లో ఏ మాత్రం ఇబ్బందులున్నా పోలింగ్ శాతంపై ప్రభావం పడుతుంది. ఈ విషయాన్ని గుర్తించే వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించారు. శాసనసభ ఎన్నికలు మరో 40 రోజులున్న నేపథ్యంలో జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో పరిస్థితులు చక్కదిద్దుతున్నారు. కొన్నిచోట్ల సమస్యలు పరిష్కరించారు. ఎన్నికలు సమీపించే నాటికి అన్నిచోట్లా పూర్తి స్థాయి వసతులు కల్పిస్తామంటున్నారు. అయితే ప్రతి ఎన్నికల సమయంలో ఈ మాట చెబుతున్నా పోలింగ్ రోజున ఇబ్బందులు పునరావృతమవుతున్నాయి. వసతుల లేమి గుర్తింపు గణాంకాల్లో తేడాలే ఇందుకు కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

క్షేత్ర స్థాయిలో ఇలా..

లేనిచోట కొత్త ర్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని, దెబ్బతిన్న వాటిని మరమ్మతు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్తు సదుపాయం చాలాచోట్ల పూర్తి స్థాయిలో ఉన్నట్టు రికార్డుల్లో చూపుతున్నారు. క్షేత్ర స్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులుంటున్నాయి. కొన్నిచోట్ల మరుగుదొడ్లున్నా నీటి సదుపాయం లేక నిరుపయోగంగా మారాయి. వాటినీ టిక్ చేస్తున్నారు.

జిల్లాలో పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనకు ప్రత్యేకంగా నిధుల కేటాయింపు లేవని అధికారులంటున్నారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల ఇబ్బందులను పంచాయతీల నేతృత్వంలో నిధులు వెచ్చించి పరిష్కరిస్తామంటున్నారు. అన్నిచోట్లా ఇది సాధ్యమవుతుందా? పూర్తవుతాయా? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. తాత్కాలికంగా ఒక శౌచాలయం నిర్మించాలన్నా రూ.15 వేలు కేటాయించాలి.

ర్యాంపుల ఏర్పాటు పనులు మాత్రం చాలాచోట్ల సాగుతున్నాయి.

భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల–ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల కొరత తీవ్రంగా ఉంది. పాతవి నిరుపయోగంగా మారాయి. కొత్తవాటిని పూర్తి స్థాయిలో ఉపయోగించేందుకు వీలుగా నీటి సదుపాయం కల్పించాల్సి ఉంది.

చర్ల మండలం ఉంజుపల్లి గిరిజన ప్రాథమిక పాఠశాలకు విద్యుత్తు సదుపాయం లేదు. కొయ్యూరు, మామిడిగూడెం కేంద్రాల్లో ర్యాంపులు లేవు.ఇల్లెందులోని కళాసీబస్తీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రంలో మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించలేదు. తాగునీటి సౌకర్యం లేదు.

టేకులపల్లి మండలంలోని రోళ్లపాడు పోలింగ్ కేంద్రం అటవీ ప్రాంతంలో ఉంటుంది. చరవాణి సిగ్నల్ ఉండదు. అవాంఛనీయ ఘటనలు జరిగినా సమాచారం చేరవేయటం కష్టం. ఇక్కడ తాగునీటి సదుపాయం లేదు. రెండు మరుగుదొడ్లున్నా ఒకటే ఉపయోగంలో ఉంది.

ఉన్నతాధికారులు పది రోజుల్లో పనులు పూర్తి చేయాలని రెండు రోజుల క్రితమే ఆదేశించారు. కానీ కొన్ని నియోజకవర్గాల్లో మందకొడిగా సాగుతున్నాయి. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో అసలు పనులు ప్రారంభించలేదు.

కొత్తగూడెం శ్రీరామచంద్ర పాఠశాల వద్ద డ్రైనేజీ నిర్మాణం కొనసాగుతోంది. పనులు పూర్తి కాకపోవడంతో పైన ఇనుప రేకులు వేశారు. ఎన్నికల వరకు డ్రైనేజీ పూర్తి చేయకుంటే కేంద్రంలోకి వెళ్లాలంటే చాలా ఇబ్బందవుతుంది.

పాల్వంచ మండల పరిధిలోని కారేగట్టు, యానంబైలు పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్‌లు లేవు.

చుంచుపల్లి మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు సరిచేస్తున్నారు.

సుజాతనగర్ మండలం సీతంపేట పోలింగ్ కేంద్రంలో మరుగుదొడ్డి సదుపాయం లేదు.

మణుగూరు మండలంలోని ఎస్టీ బాలుర వసతి గృహంలోని 131, 133, 134, 136 పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపు సౌకర్యం లేదు. సమితిసింగారం, కూనవరం, ఎన్టీఆర్‌నగర్, బాపనకుంట ఎంపీపీఎస్ పాఠశాలల్లోని కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి.

మణుగూరు మండలం ఎన్టీఆర్ నగర్‌లోని ఎంపీపీఎస్ పాఠశాలలో 107వ పోలింగ్ కేంద్రానికి విద్యుత్తు సదుపాయం లేదు. కూనవరం ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో ఆరు పోలింగ్ కేంద్రాలకు కరెంటు సౌకర్యం కరవైంది.

పినపాక మండలంలోని ఎల్చిరెడ్డిపల్లి ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాల 62వ పోలింగ్ కేంద్రానికి తాగునీటి సదుపాయం లేదు. ముకుందాపురం, మల్లారంలోని ప్రాథమిక పాఠశాలల్లో కేంద్రాలకు సైతం తాగునీరు లేదు.

గుండాల మండలం లింగగూడెంలో మరుగుదొడ్లు లేవు. ఆళ్లపల్లి మండలంలోని రాయపాడు పంచాయతీ కార్యాలయంలోని 17వ పోలింగ్ కేంద్రంలో మరుగుదొడ్లు లేవు.

అశ్వారావుపేట మండల కేంద్రానికి 27 కి.మీ. దూరంలో ఉన్న మద్దులమడలో తాగునీటి సౌకర్యం లేదు.

అశ్వారావుపేటకు 24 కి.మీ. దూరంలో ఉన్న మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన కావడిగుండ్ల, కొత్తకన్నాయిగూడేనికి సెల్ సిగ్నల్ ఉండదు. కొత్తకన్నాయిగూడెం పాఠశాలలో ర్యాంపు, మరుగుదొడ్లను ప్రస్తుతం నిర్మిస్తున్నారు.

అన్నపురెడ్డిపల్లి మండలం మహబూబ్ నగర్ పోలింగ్ కేంద్రం ఏర్పాటుచేసిన ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, విద్యుత్తు సౌకర్యాలు లేవు.

# ఓటుకు జైకొడదాం!!

మహబూబాబాద్ : ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు. ప్రజాస్వామ్య పరిరక్షణకు వజ్రాయుధం. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలంటూ ఎన్నికల అధికారులు ఎన్నో చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నారు. అందుబాటులోకి వచ్చిన సాంకేతికతను జోడిస్తూ వినూత్నంగా అవగాహన కల్పిస్తున్నారు. వీవీప్యాట్‌లు, ఈవీఎంలపై అనుమానాలను నివృత్తి చేస్తున్నారు. అయినా ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొందరు ఓటింగ్‌కు దూరంగానే ఉంటున్నారు. ఇందుకు నిదర్శనం 2018 డిసెంబరులో జరిగిన శాసనసభ ఎన్నికల్లో 82.67 శాతం పోలింగ్ నమోదు కావడం. మళ్లీ ఎన్నికలు వస్తున్నాయి. నవంబరు 30న పోలింగ్ నిర్వహించడానికి యంత్రాంగం సకల ఏర్పాట్లు చేస్తోంది. ఈసారైనా ఓటును గెలిపించాలి.

2018లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 శాసనసభ నియోజకవర్గాల్లో 26,12,841 మంది ఓటర్లు ఉన్నాయి. 21,60,105 మంది ఓటేశారు. 4,52,736 మంది పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. ఎక్కువగా పట్టణ వాసులు ఓటు వేయడానికి ఆసక్తి చూపడం లేదు. కారణాలు ఏమైనా ఇంత మంది ఓటుకు దూరంగా ఉన్నారంటే ప్రజాస్వామ్యానికి మాయని మచ్చే. పరోక్షంగా మన భవిష్యత్తును మనం అడ్డుకున్నట్లే. మన ప్రాంత అభివృద్ధిని కాలరాసినట్లే. ఓటు వేయకపోతే ఏమైంది అని అందరూ అనుకుంటే ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంది. నేను ఓటేస్తా.. పది మందితో ఓటు వేయిస్తా అనే ఆలోచన అందరిలో రావాలి. అప్పుడే పోలింగ్ పోటెత్తుతుంది.

అధికారులూ.. దృష్టి సారించాలి

పల్లె ప్రాంత ఓటర్ల కంటే పట్టణ ప్రాంతాల వారే ఎక్కువ చదువుకున్న వారున్నారు. ఓటర్లు కూడా పట్టణాల్లోనే ఎక్కువగా ఉంటారు. కానీ హక్కును వినియోగించుకోవడంలో ఆసక్తి చూపడం లేదు. ఓటు వేయడంలో పల్లె ఓటర్లే ఆదర్శం. 2018 శాసనసభ ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ, తూర్పు నియోజకవర్గాలోని ఓటర్లే ఎక్కువ శాతం పోలింగ్ కేంద్రాలకు రాలేదు. ఈసారి పోలింగ్ శాతం పెరిగేలా అధికారులు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాలి. కేంద్రాల వారీగా ఆరా తీసి సమీక్షించాలి. చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలి.

మనం ఆదర్శమవుదాం

అధికారులు వచ్చి చెబితేనే.. బరిలో నిలిచిన అభ్యర్థులు ఏదో ఒక విధంగా లాభం చేకూరుస్తేనే ఓటు వేస్తాననే ఆలోచనను విరమించుకోవాలి. మనమే ఇప్పుడు ఒకరికి స్ఫూర్తిగా, ఆదర్శంగా నిలుద్దాం. ప్రలోభాలను పక్కనపెట్టి బలమైన ఓటుతో మన ప్రాంత అభివృద్ధికి పాటుపడే వ్యక్తికి పట్టం కట్టాలి. ఐదు సంవత్సరాలకు ఒకసారి వచ్చే అవకాశాన్ని చేజార్చుకోకండి.

ఓటింగ్ శాతం పెంచడానికి..ఈసారి పోలింగ్ శాతం పెంచడానికి ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోంది. ప్రతి నియోజకవర్గంలో ఐదు మహిళ, ఐదు ఆదర్శ, ఒక దివ్యాంగులు, ఒక యువ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయిస్తోంది. 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతంపైగా అంగవైకల్యం ఉన్న వారు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పించింది. ఇందుకోసం ఫారం 12డి దరఖాస్తు చేసుకోవాలి. కొత్తగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు.

ఎందుకు తగ్గుతుందంటే?

పోలింగ్ శాతం తగ్గడానికి వివిధ కారణాలను ఎన్నికల సంఘం గుర్తించింది. మహిళలకు కేంద్రాల వద్ద మూత్రశాలలు లేకపోవడం, క్యూలైన్లో ఎక్కువ సేపు నిల్చొనేందుకు ఇష్టపడకపోవడం, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం, వ్యక్తిగత పనులకు ప్రాధాన్యం ఇవ్వడం, సెలవు కావడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లడం, మారుమూల ప్రాంతాల్లో రవాణా వ్యవస్థ సరిగా లేకపోవడం, కొందరు నిరాసక్తిని ప్రదర్శించడం తదితర కారణాలు సూచించింది. ఇలాంటివి ఉమ్మడి జిల్లాలో చాలా ఉన్నాయి. వాటిపై అధికారులు దృష్టి పెట్టాలి.

ఒక్కసారి ఆలోచించండి..సాధరణంగా ఎన్నికల బరిలో ప్రధాన అభ్యర్థులు ముగ్గురు ఉంటారు. వారి మధ్యే పోటీ ఉంటుంది. పోలింగ్ కూడా 70 నుంచి 80 శాతం జరుగుతుంది. అందులో 25 నుంచి 35 శాతం ఓట్లు వచ్చిన వారే విజేతలవుతారు. చాలా తక్కువ మంది కోరుకున్న వారే అసెంబ్లీకి వెళ్తున్నారు. అదే పూర్తి స్థాయిలో పోలింగ్ జరిగితే అసలుసిసలైన నేతే విజయం సాధిస్తారు.

# ప్రారంభించారు.. తాళం వేసేశారు

ములుగు : కోట్లాది రూపాయలు వెచ్చించి అధునాత యంత్రాలతో ఏర్పాటు చేసిన దోబీఘాట్, చెత్త రవాణా కేంద్రాల సేవలు నగర ప్రజలకు అందుబాటులోకి రావడం లేదు. గ్రేటర్ వరంగల్ ఇంజినీర్ల నిర్లక్ష్యం, అలసత్వమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. స్మార్ట్‌సిటీ పథకం ద్వారా సుమారు రూ.3.21 కోట్లతో అత్యాధునిక యంత్రాలతో వరంగల్ నగరంలో దోబీఘాట్ నిర్మించారు. దీనిద్వారా సుమారు 100 మంది యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేశారు. కానీ గ్రేటర్ వరంగల్, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖల మధ్య సమన్వయ లోపంతో ఇప్పటి వరకు అక్కడ పనిచేసే యువకుల ఎంపిక పూర్తి చేయలేదు. అలాగే మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండౌర్ సిటీ స్ఫూర్తితో పోతన మందిరంలో రూ.3.50 కోట్లతో ఆధునిక చెత్త రవాణా కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ నెల




6వ తేదీన రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ వరంగల్ నగర పర్యటన సందర్భంగా పోతననగర్‌లో అధునాతన యాంత్రికృత దోబీఘాట్, ఆధునిక చెత్త రవాణా కేంద్రాలను ప్రారంభించారు. అక్కడితో తమ పని అయినట్లు అధికారులు వాటి గురించి పట్టించుకోవడం లేదు. రెండు వారాలు అవుతున్నా వాటికి తాళాలు తీయడం లేదు. రూ.కోట్లు ఖర్చు పెట్టి కొనుగోలు చేసిన ఆధునిక యంత్రాలు వృథాగా పడి ఉంటున్నాయి. చెత్త రావాణాకు నాలుగు భారీ వాహనాలు, చెత్తను బెయిలింగ్ చేసే మిషన్లు, కంటైనర్లు కొనుగోలు చేసి నిరుపయోగంగా పెట్టేశారు.

# మహిళా సమ్మాన్.. సెల్ఫీ దిగుదాం

ఖమ్మం : తపాలా కార్యాలయాల్లో ప్రధాన మంత్రికి ధన్యవాదాలు తెలిపే సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేశారు. ఇక్కడ మహిళా సమ్మాన్ పథకంలో చేరిన మహిళ ఫొటో తీసుకోవాలి. బలవంతం ఏమీ లేదు. ఇష్టపడేవారికి మాత్రమే. మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన మహిళా సమ్మాన్ పథకంపై అవగాహన కోసం ఇలాంటి ఏర్పాటు చేశారు. ఖమ్మం ప్రధాన తపాలా కార్యాలయంలో మహిళా సమ్మాన్ ఖాతా తెరిచిన మహిళలకు ఇక్కడి స్వీయ చిత్ర పాయింట్‌ను చూపిస్తున్నారు. అందులో ఆసక్తి ఉన్న వారు ఫొటో దిగేందుకు సమ్మతిస్తున్నారు.

మహిళా సమ్మాన్ మహిళలకు మాత్రమే. తన పేరుపై, ఆడ పిల్లలు, మైనర్ బాలికలైతే సంరక్షకురాలి పేరుతో ఖాతా తెరవాల్సి ఉంటుంది.




రెండేళ్ల గడువు కాలం, వెయ్యి రూపాయల నుంచి గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు పొదుపు చేసుకునే వెసులుబాటు, రెండు లక్షలతో ఖాతా తెరిచిన మహిళకు రెండేళ్ల గడువు తర్వాత రూ.2,32,044 అందజేస్తారు. ఖాతాలో చేరిన మహిళ ఓ ఏడాది తర్వాత కట్టిన మొత్తంలో 40 శాతం తీసుకోవచ్చు. వద్దనుకుంటే ఆరు నెలల తర్వాత ఉపసంహరించుకునే సదుపాయం ఉంది.

తపాలా కార్యాలయంలో లభించే దరఖాస్తు పూర్తి చేసి, ఆధార్, పాన్ కార్డులు సమర్పించి ఉమ్మడి జిల్లాలోని ఏ తపాలా కార్యాలయంలోనైనా ఖాతా తెరిచే సదుపాయం అందుబాటులో ఉంది. కొద్ది రోజుల్లోనే 300 మంది మహిళలు ఈ పథకంలో చేరారు.

# కొత్త మార్గంలో కార్గో!

వరంగల్ : కొవిడ్ నుంచి ఆర్టీసీ తన నష్టాలను పూడ్చుకునేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తోంది. దీనిలో భాగంగానే 2020 జూన్‌లో కార్గో పార్శిల్ సేవలను ప్రారంభించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9 డిపోల పరిధిలో 11 చోట్ల ఈ సేవలకు శ్రీకారం చుట్టింది. ప్రారంభించిన తొలినాళ్లలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజుకు రూ.5వేల నుంచి రూ.6 వేల వరకు ఆదాయం వచ్చేది. ప్రస్తుతం రూ.1.50లక్షల నుంచి రూ.1.60 లక్షలకు పైగా ప్రతిరోజూ సమకూరుతోంది. డిపో పరిధిలో ఒక మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ అధికారితో పాటు ఆర్టీసీ పొరుగు సేవల సిబ్బందిని ఈ సేవల కోసం ప్రత్యేకంగా నియమించారు. ఇటీవల కార్గోను లాజిస్టిక్‌గా మార్చిన అధికారులు దీనిని ప్రైవేటు ఏజెంట్లకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్, నర్సంపేట, తొర్రూరు, పరకాల, ములుగు ప్రాంతాల్లోని కార్గోలను కమీషన్ బేసిక్‌పై ఇప్పటికే ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. అత్యధిక ఆదాయం వచ్చే హనుమకొండ, వరంగల్ కేంద్రాలను ఆర్టీసీ నిర్వహిస్తోంది. త్వరలోనే వీటిని కూడా ప్రైవేటు వారికి అప్పగించేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. ఏజెంట్లకు అప్పగిస్తే ఇప్పుడున్న ఆదాయానికంటే మరింత ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని ఆర్టీసీ



లెక్కలేస్తోంది. ఏజెంట్లకు అప్పగించడం వలన సిబ్బందిని వారే నియమించుకుంటారు. వీరిపై ఆర్టీసీకి చెందిన మార్కెటింగ్ అధికారి పర్యవేక్షణ చేస్తారు.

అధిక ఆదాయం వస్తుందనీ..

లాజిస్టిక్ కేంద్రాలను ప్రైవేటు వ్యక్తులకు 12 శాతం కమీషన్‌పై అప్పగించనున్నట్లు సమాచారం. దీనికి తోడు కేంద్రం నిర్వహణకు అద్దె చెల్లించడంతో పాటు పార్శిళ్ల ద్వారా వచ్చే ఆదాయంలోనూ ఆర్టీసీకి వాటా వస్తుందని అధికారులు చెబుతున్నారు. కరోనా సమయంలో బస్సులు సరిగా నడవలేని సమయంలో ఆర్టీసీ సిబ్బందిని కార్గో సేవలకు వినియోగించామని, ప్రస్తుతం వందశాతం బస్సులు నడుస్తుండడంతో.. తిరిగి వారి విధులనే కేటాయిస్తున్నామని పేర్కొంటున్నారు. అత్యధికంగా ఆదాయం వచ్చే కేంద్రాలను ప్రైవేటుకు అప్పగించడం సమంజసం కాదని సిబ్బంది ఆరోపిస్తున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..- ఎం.వేణుగోపాల్, ఏటీఎం, లాజిస్టిక్ వరంగల్ రీజియన్ అధికారి

ఇప్పటికే హనుమకొండ, వరంగల్ మినహా అన్నికేంద్రాలు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ప్రైవేటుకు అప్పగించాం. కొవిడ్ సమయంలో ఆర్టీసీ బస్సులు పూర్తిస్థాయిలో నడపకపోవడంతో.. సిబ్బందిని కార్గో సేవలకు ఉపయోగించాం. ప్రస్తుతం బస్సులు పూర్తిస్థాయిలో నడుస్తున్నాయి. లాజిస్టిక్ కేంద్రాలు ఇతరులకు అప్పగించడం వలన కార్యాలయాలకు అద్దెతో పాటు ఇతర ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ప్రైవేటుకు అప్పగించినా పూర్తిస్థాయిలో ఆర్టీసీ అధికారులే పర్యవేక్షిస్తారు.

# ఉద్యోగ భద్రతకు సహకారం




ఖమ్మం : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో ఉత్తర్వు- 44 ప్రకారం దశాబ్దాల తరబడి పనిచేస్తున్న ఉద్యోగుల కల ఎట్టకేలకు నెరవేరింది. సహకార వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచి వీరికి ఉద్యోగ భద్రత లేదు. సంఘాల అధ్యక్షుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి విధులు నిర్వర్తిస్తున్నారు. ఇలాంటి ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలని, వేతనాలను స్థిరీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మరోవైపు సహకార సంఘాల అధ్యక్షులకు సైతం గౌరవ వేతనాన్ని సర్కారు పెంచింది. ఖమ్మం డీసీసీబీ పరిధిలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో 100 సహకార సంఘాలు ఉన్నాయి.

317 మంది ఉద్యోగులకు లబ్ధి

సర్కారు తాజా నిర్ణయం వల్ల సహకార సంఘాల్లో కార్యదర్శి, స్టాఫ్ అసిస్టెంట్, సబ్‌స్టాఫ్ క్యాడర్లలో పనిచేస్తున్న 317 మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. అర్హుల జాబితాను డీఎల్ఈసీ (డీసీసీబీ లెవల్ ఎంపవర్‌మెంట్ కమిటీ) నుంచి ఎస్ఎల్ఈసీ (స్టేట్ లెవల్ ఎంపవర్‌మెంట్ కమిటీ)కి అధికారులు పంపించారు. ఖమ్మం జిల్లాలోని ఉద్యోగులకు శుక్రవారం నుంచి ఉత్తర్వులు జారీ కానున్నాయి.

బేసిక్‌పేపై 103 శాతం డీఏ, పదకొండు శాతం హెచ్ఆర్ఏ చెల్లిస్తారు. ఇది 2014 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. అంతకుముందున్న సర్వీసు పీరియడ్‌కు.. జీవో నంబరు-115 ప్రకారం 2009 మార్చి 31కి ముందు ప్రతి 18 నెలలకోసారి ఇంక్రిమెంట్ ఇస్తూ 2009 ఏప్రిల్ 1ని కటాఫ్ తేదీగా నిర్ణయించారు. 2009 ఏప్రిల్ 1 నుంచి 2014 మార్చి 31 వరకు ఏటా ఒక ఇంక్రిమెంట్ చొప్పున ఇస్తూ ఉద్యోగుల బేసిక్ పేను ఫిక్స్ చేశారు. 2021-22 ఆడిట్ రిపోర్టు ఆధారంగా పెరిగిన వేతనం చెల్లిస్తారు.

అధ్యక్షులకు పెరిగిన గౌరవం

పీఏసీఎస్‌ల అధ్యక్షులకు ఇప్పటివరకు గౌరవ వేతనం నెలకు రూ.1,250 అందింది. సంఘాల టర్నోవర్ ఆధారంగా గౌరవ వేతనమివ్వాలని సర్కారు తాజాగా నిర్ణయించింది. ఖమ్మం టేకులపల్లి ఆంధ్రాబ్యాంకు కర్షక సేవాసమితి అధ్యక్షుడు బీరెడ్డి నాగచంద్రారెడ్డి ఒక్కరే అత్యధికంగా గౌరవ వేతనం రూ.15వేలు పొందనున్నారు. ఈ సంఘం టర్నోవర్ రూ.41కోట్లు.

ఖమ్మం జిల్లాలో 221 మంది ఉద్యోగులకు 205 మంది సర్వీసును క్రమబద్ధీకరించి వేతనాలను స్థిరీకరించామని డీసీఓ విజయకుమారి తెలిపారు. సర్వీసులో అంతరాయం, ఇతర కారణాల వల్ల మరో 16 మందికి వర్తింపజేయలేదన్నారు.

# ప్రగతి పత్రాలు.. ఆన్‌లైన్‌లో



ఖమ్మం : పాఠశాల విద్యార్థులకు ఎస్ఏ-2 పరీక్షలు పూర్తయ్యాయి. ప్రస్తుత విద్యా సంవత్సరం ఈ నెల 24తో ముగియనుంది. విద్యార్థుల ప్రశ్నపత్రాల మూల్యాంకన వివరాలు తెలిపే ప్రోగ్రెస్ కార్డుల (ప్రగతి పత్రాలు) పంపిణీ కరోనా నాటినుంచి నిలిచిపోయింది. ఈసారి ఆన్‌లైన్ ద్వారా అందించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈపాటికే నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక (ఎస్ఏ-1) పరీక్షలకు సంబంధించిన ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయగా, ఎస్ఏ-2 ఫలితాలనూ వెబ్‌సైట్‌లో నమోదు చేసేలా ఏర్పాటు చేస్తున్నారు.

గతంలో ఇలా..

2019-20 విద్యా సంవత్సరం వరకు ప్రతి విద్యార్థికి సంచిత సమగ్ర నివేదికలు అందించేవారు. అందులో విద్యార్థి వ్యక్తిగత వివరాలు, ఫొటో, మార్కులు, గ్రేడ్లు, తరగతి వారీగా ఆరోగ్య సమాచారం, వివరణాత్మక సూచనలు నమోదు చేసి దానిపై తల్లిదండ్రుల సంతకాలు తీసుకునేవారు. ప్రభుత్వం సరఫరా చేసే ఈ నివేదిక 25 పేజీలతో ఉండేవి. ఇందులో భాగమైన ప్రోగ్రెస్ కార్డులోనే విద్యార్థుల మార్కులుండేవి. పాఠశాల మారితే విద్యార్థి తన వెంట ఈ కార్డు తీసుకెళ్లి కొత్తగా చేరిన పాఠశాలలో అప్పగించేవారు. నాలుగేళ్లుగా సమగ్ర శిక్షాభియాన్ నిలిపివేయడంతో ప్రధానోపాధ్యాయులు పాఠశాల అభివృద్ధి నిధుల నుంచి ప్రైవేటుగా సమగ్ర నివేదిక తయారు చేయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అరకొరగా వచ్చే నిధులు నిర్వహణకే సరిపోవడం లేదని, వీటి కొనుగోలు ఆర్థిక భారంగా మారిందని ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో పాత విధానానికి స్వస్తి పలికి విద్యార్థులకు ఇకనుంచి ఒకటే ఆన్‌లైన్ ప్రగతి పత్రాన్ని అందించనున్నారు.“ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి ఆన్‌లైన్ ప్రగతి పత్రాలు అందించే ఏర్పాటు చేస్తున్నాం. ఈ నెల 23లోగా నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక పరీక్షలకు సంబంధించిన ఫలితాలు నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించాం. విద్యార్థుల వారీగా ప్రగతి పత్రాలను సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసి ప్రింట్ తీసుకుని సిద్ధంగా ఉంచాలి. ఈ నెల 24న తల్లిదండ్రులతో చివరి సమావేశం నిర్వహించి ప్రతి విద్యార్థికి ఆన్‌లైన్ ప్రోగ్రెస్ కార్డులను అందించాలి.”సోమశేఖరశర్మ, డీఈవో, భద్రాద్రి

# కరవు సీమలో పాల వెల్లువ

జనగామ : జనగామలోని పాల శీతలీకరణ కేంద్రం (విజయ డెయిరీ) రికార్డు స్థాయిలో పాలను సేకరిస్తోంది. పాల సేకరణలో రాష్ట్ర స్థాయిలో నాలుగో స్థానంలో నిలిచింది. పాడి రైతులకు ప్రోత్సాహమందిస్తూ ప్రగతిపథంలో పయనిస్తోంది.

రోజూ 25 వేల లీటర్ల సేకరణ

జనగామ పాలశీతలీకరణ కేంద్రం పరిధిలోకి జిల్లాలోని 12 మండలాలతో పాటు యాదాద్రి-భువనగిరి జిల్లా రాజపేట, సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం కూడా వస్తాయి. వీటిలో మొత్తం 250 పాల సేకరణ కేంద్రాలు ఉన్నాయి. 4వేల మందికి పాడి రైతులు పాలను విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. గతంలో వివిధ మండలాల నుంచి సేకరించిన పాలను జనగామకు తీసుకొచ్చి హైదరాబాద్‌లోని విజయ డెయిరీకి పంపించేవారు. ఈ ఏడాది నుంచి జిల్లాలోని బచ్చన్నపేట, నర్మెట్ట, సింగరాజుపల్లి, లింగాలఘనపురం, చీటూరు, కామారెడ్డిగూడెంలో మినీ బల్క్ మిల్క్ సెంటర్ యూనిట్(బీఎంసీయూ)లను నెలకొల్పి సేకరించిన పాలను అక్కడే చిల్లింగ్ చేసి నేరుగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.

పాడి రైతులకు ప్రోత్సాహకాలు

విజయ డెయిరీ కేంద్రాలకు పాలను విక్రయించే రైతులకు పలు ప్రోత్సాహకాలను అందిస్తున్నారు. పశువులకు వాడే ఫోడర్ సీడ్, మినరల్ మిక్చర్, క్యాల్షియం, విజయ క్యాటిల్ ఫీడ్, డీవార్మింగ్ మందులు, టీకాలను రాయితీపై అందిస్తున్నారు. రైతుల కుటుంబాల్లో వివాహాలు జరిగితే రూ.5 వేలు కానుక పేరుతో అందిస్తున్నారు. మరణించిన రైతుల అంత్యక్రియలకు రూ.5 వేల సాయమందిస్తున్నారు. వారి పిల్లలు పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిస్తే రూ.1000 ప్రోత్సాహక బహుమతిని విజయ డెయిరీ అందిస్తోంది. ముద్ర రుణాలు అందజేస్తున్నారు. రైతులు పాడి పశువులను కొనుగోలు చేసేందుకు ప్రధానమంత్రి రుణ పథకం, ముద్ర పథకాల్లో రూ.10 లక్షల చొప్పున ఎస్‌బీఐ రుణాలు మంజూరు చేయనుంది. ఈ పథకానికి ఇప్పటికే జనగామ జిల్లాలో 600 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు.

ప్రత్యేక కమిటీల ఏర్పాటు

గతేడాది ప్రతి మండలంలో 9 మంది చొప్పున పాడి రైతులతో కమిటీలను ఏర్పాటు చేశారు. కొత్తగా జిల్లాలో ఆరు పాల సేకరణ కేంద్రాలను సొసైటీలకు అప్పగించారు. జనగామ పాలశీతలీకరణ కేంద్రం ద్వారా సేకరిస్తున్న పాలు టెట్రా పాలకు కూడా అర్హత



పొందాయి. ఇప్పుడు జనగామ, ఇతర కేంద్రాల ద్వారా నేరుగా హైదరాబాద్‌కు పాలను రవాణా చేస్తున్నారు. ప్రయోగాత్మకంగా ‘పాలమిత్ర’ యాప్‌ను రూపొందించి జనగామ, బచ్చన్నపేట కేంద్రాల్లోని రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ యాప్ ద్వారా రైతులు కేంద్రాలకు పోస్తున్న పాలు, ధర, ఇతర సౌకర్యాలను ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుంది. రానున్న రోజుల్లో జనగామలోని పాలశీతలీకరణ కేంద్రంలోనే పాల పొట్లాలు తయారు చేయాలని, మార్కెటింగ్ వసతులు కల్పించాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ.4 కోట్లు వెచ్చించి యంత్ర పరికరాలు తీసుకురానున్నారు.

ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం.. - జి.ధన్‌రాజ్, ఉపసంచాలకులు, జనగామ విజయ డెయిరీ

రానున్న రోజుల్లో రోజుకు 60 వేల లీటర్ల పాలు సేకరించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందుకోసం ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తున్నాం. త్వరలో జనగామ కేంద్రంలో రూ.4 కోట్లతో పాల పొట్లాల తయారీని ప్రారంభించాలనుకుంటున్నాం. గ్రామాల్లో పశుగణన చేపట్టి పాల దిగుబడి పెంచేందుకు చర్యలు చేపడుతున్నాం.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి- జనగాం సోమిరెడ్డి, పాల ఉత్పత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు

జనగామ పాలశీతలీకరణ కేంద్రంలో రికార్డు స్థాయిలో పాల సేకరణ చేసేందుకు చర్యలు చేపడతాం. రైతులకు రాయితీపై దాణా అందజేస్తున్నాం. గ్రామాల్లోని పాల కేంద్రాలను తరచూ సందర్శించి రైతుల కష్ట, నష్టాలను తెలుసుకుంటున్నాం. వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

# మూతపడిన యంత్రాలు.. పని లేక రెండేళ్లు!

మహబూబాబాద్ : పసుపు ధర దిన దినం పడిపోవడంతో ఉపాధి నిలిచిపోయింది. పసుపు కొమ్ములకు పాలిష్ చేస్తూ స్వయం ఉపాధి పొందుతున్న వ్యాపారుల ఆశలు నిరాశలయ్యాయి. ఒకటి కాదు రెండు కాదు లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసుకున్న యంత్రాలు పని లేక తుప్పు పట్టిపోతుండటంతో తల్లడిల్లుతున్నారు. యంత్రాల కొనుగోలు చేసిన అప్పులు చెల్లించడానికి.. కరెంట్ బిల్లులు కట్టేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఆ భారాన్ని పూడ్చుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నారు. ఈ పనిపై ఆధారపడిన 250 మంది కూలీలలో 200 మందికి పనుల్లేక వేరే పనులు దొరకక అవస్థలు పడుతున్నారు. పసుపు ధర తగ్గడంతో యంత్రాలు మూతపడ్డాయి. వ్యాపారులు, కూలీలు పడుతున్న ఇబ్బందులపై మానవీయ కథనం.. మొదట్లో కేసముద్రం విపణిలో పసుపు కొనుగోలు చేసిన వ్యాపారులు నిజామాబాద్‌కు తీసుకెళ్లి అక్కడ పాలిషింగ్ చేయించి ఇతర ప్రాంతాలకు విక్రయించే వారు. ఆ తర్వాత ఉమ్మడి జిల్లాలో పసుపు సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. దిగుబడులు కూడా ఆశించిన స్థాయిలో రావడంతో కేసముద్రం విపణిలో విక్రయాలు పెరిగాయి. వ్యాపారులు నిజామాబాద్‌కు వెళ్లకుండా స్వయంగా ఇక్కడనే పసుపు పాలిషింగ్(డోలా) యంత్రాలను ఏర్పాటు చేసుకున్నారు. పాలిష్ చేసి ఇతర రాష్ట్రాలకు, బంగ్లాదేశ్, చైనా, అరబ్ దేశాలకు ఎగుమతి చేస్తూ లాభాలు గడించారు. రెండు, మూడు యంత్రాలతో కొనసాగిన పాలిషింగ్ 20 యంత్రాలకు చేరింది. ప్రస్తుతం సాగు విస్తీర్ణం తగ్గడం. వరంగల్, కేసముద్రం మార్కెట్లకు ఏడాదికి సుమారు 8 లక్షల బస్తాలు విక్రయానికి వస్తే ధర లేక లక్ష బస్తాలు కూడా రావడం లేదు.

దుబ్బ పడుతున్న యంత్రాలు..



ఒక్కో వ్యాపారి యంత్రానికి రూ.10 లక్షలు, షెడ్, గోదాం నిర్మాణానికి మరో రూ.20 నుంచి రూ.25 లక్షల చొప్పున మొత్తంగా రూ.30 నుంచి రూ.35 లక్షలు వెచ్చించి 20 పాలిషింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకు బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకున్నారు. ఇప్పుడు పనులు లేక 15 యంత్రాలు దుబ్బపడుతున్నాయి. కొన్ని తుప్పుపట్టాయి. కరెంట్ బిల్లులు రూ.10 వేలు చెల్లిస్తున్నారు. కొందరు ఆ బిల్లులను కూడా చెల్లించడానికి డబ్బులు లేక 63 నుంచి 75 హెచ్‌పీ సామర్థ్యంతో ఏర్పాటు చేసుకున్న నియంత్రికలను తీసుకెళ్లాలని, కరెంట్ కనెక్షన్‌ను తొలగించాలని విద్యుత్తు శాఖ అధికారులకు విన్నవించుకుంటున్నారు.

నాణ్యత లేమి..

ఒకప్పుడు కర్కుమిన్, అయిల్ శాతం వ్యాపారులు నచ్చే విధంగా ఉన్నటువంటి పసుపులో ఇప్పుడు ఆ నాణ్యత ప్రమాణాలు తగ్గాయి. ఇందుకు ముఖ్య కారణం గత 30 ఏళ్ల నుంచి ఈ ప్రాంత రైతులు పసుపు సాగును ప్రధాన పంటగా సాగు చేస్తున్నారు. మంచి నాణ్యత ఉండడంతో గుర్తింపు లభించింది. అలాంటిది రైతులు ఏటా విత్తన మార్పిడి చేయకుండా పండించిన పంటనే తిరిగి విత్తనంగా వినియోగించడం వల్ల చీడపీడల బెడద పెరిగి నాణ్యత తగ్గింది.

దుబ్బపట్టిన పాలిషింగ్(డోలా) యంత్రాన్ని చూపుతున్న ఈ వ్యాపారి కేసముద్రానికి చెందిన అనుమాండ్ల వేణుగోపాల్‌రెడ్డి. 25 ఏళ్ల నుంచి మార్కెట్లో పసుపు ఖరీదు చేస్తున్నారు. పాలిషింగ్ చేసి ఇతర ప్రాంతాలకు విక్రయించే వారు. అంతకు ముందు కొనుగోలు చేసిన పసుపు బస్తాలు గోదాంలోనే నిల్వ ఉన్నట్లు ఆయన చెబుతున్నారు. నాణ్యమైన పంట వస్తేనే అర్డర్లు వచ్చి యంత్రాలకు పని కలుగుతుందని వాపోతున్నారు.

ఇలాంటి పరిస్థితులు వస్తాయనుకోలేదు

చిదిరాల వసంతరావు, కేసముద్రం

కేసముద్రం మార్కెట్ పరిధిలో గత 30 ఏళ్లుగా పసుపు ఖరీదు చేస్తున్నాను. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి చేశాం. పసుపు కొమ్ములకు మంచి డిమాండ్ ఉండేది. ప్రస్తుతం నాణ్యత లేక డిమాండ్ తగ్గింది. దీంతో వ్యాపారులు ఖరీదు చేయడానికి ఇష్టపడడం లేదు. మార్కెట్‌కు పసుపు రాబడులు పూర్తిగా పడిపోయాయి. ఫలితంగా రూ.15 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసుకున్న డోలా యంత్రాలను మూసేశాం. దీనిపై ఆధారపడిన కూలీలకు పనులు లేవు. ఇలాంటి పరిస్థితి వస్తుందని ఊహించలేదు.

# గోదావరి.. నువ్వొస్తేనే సిరి

వరంగల్ : పాకాల సరస్సు అన్నదాతలకు అన్నపూర్ణ వంటిది, ఒకసారి నిండితే వానాకాలంలో 30వేల ఎకరాలు, యాసంగిలో 10వేల ఎకరాలు సాగవుతుంది. ఈ ప్రాంత రైతుల చిరకాల స్వప్నమైన పాకాలకు గోదావరి జలాలను తెచ్చేందుకు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కృషి చేసి రెండేళ్ల కిందట యాసంగికి మూడు అడుగుల నీటిని అందించి రైతులకు భరోసా ఇచ్చారు. ప్రస్తుతం యాసంగిలో సరస్సు కింద 23 వేల ఎకరాల్లో యాసంగి సాగైంది. ప్రస్తుతం సరస్సులో 16.7 అడుగుల నీరుంది. ఇక పాకాలకు గోదావరి జలాల నిరంతర తరలింపుతోనే పంట చేతికందుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తి భరోసా ఇస్తున్నా కార్యాచరణలో ఉన్న కొన్ని లోపాలతో అన్నదాతల్లో కొంత ఆందోళన నెలకొంది. అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులను కలిసి ఆయకట్టుకు నీటిపై మాట్లాడింది.

ఇప్పటికే సగం పెట్టుబడి పెట్టాం

సారంగపాణి, రైతు, అశోక్‌నగర్

ఆయకట్టు మొత్తం సాగుకు అనుమతిచ్చారు. ఇప్పటికే ఎకరాకు 30 వేల రూపాయలు పెట్టుబడి పెట్టాం. ఇంకా 45 రోజులు నీరు అవసరం. సంగెం కాలువకు రెండు అడుగులు నీటిమట్టం తగ్గితే ప్రవాహం తగ్గి నీరు అందదు. గోదావరి జలాలను నిరంతం తరలించాలి. నీటిమట్టం తగ్గకుండా అధికారులు శ్రద్ధ చూపాలి. లేదంటే రైతులకు అధికారులే పరిహారం చెల్లించాలి

తూములకు షట్టర్లు లేక వృథాఅచ్యుతం, రైతు, అశోక్‌నగర్పాకాల తూములకు, కాలువల బుర్రలకు తలుపులు ఉంటే నీటి వృథా తగ్గేది. ప్రస్తుతం నీరు ఎక్కువగా పాకాల వాగులోకి పోతుంది. పొలానికి నీరు పెట్టుకొని బుర్రలు బంద్ చేసుకునే వెసులు బాటు లేదు. సాగుకు అనుమతిచ్చిన అధికారులకు నీరందించాల్సిన బాధ్యత కూడా ఉంది.గోదావరి జలాలొస్తాయంటేనే 13 ఎకరాలు నాటేశా

సాంబయ్య, రైతు ఖానాపురంపాకాలలోకి గోదావరి జలాలు వస్తాయన్న నమ్మకంతోనే 13 ఎకరాల్లో నాటేశా. సంగెం కాలువ కింద పరిస్థితి కాస్త ఇబ్బందిగానే ఉంది. రైతులు కూడా నీటిని వృథా చేయకుండా ఎగువ రైతులు దిగువ వారికి సహకరించాలి. రోజు నీటిని మోటార్లతో పాకాలకు తరలించాల్సిందే. 48 రోజులపాటు నిరంతరం నీరురమేష్, డీఈఈ, పాకాలఎమ్మెల్యే పెద్ది చొరవతో రామప్ప నుంచి గోదావరి జలాలను 48 రోజులు రోజుకు 300 క్యూసెక్కుల నీటిని తరలిస్తాం. పంట ఎండిపోకుండా చూస్తాం. రోజుకు 300 క్యూసెక్కులు వస్తుంటే 290 క్యూసెక్కుల నీరు పొలాలకు ప్రవహిస్తోంది. పురాతన కాలువలు కాబట్టి కొంత ఇబ్బంది ఉంది. కొన్ని కాలువల్లో నాచు పెరిగింది. తొలగించి నీరందిస్తాం. రైతులు నీటిని సంరక్షించుకోవాలి.




## 'నిజం గెలవాలి' ప్రారంభం.. తెదేపా కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన భువనేశ్వరి

చంద్రగిరి: తెదేపా అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి తలపెట్టిన 'నిజం గెలవాలి' యాత్ర ప్రారంభమైంది. నారావారిపల్లెలో తెదేపా వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహానికి ఆమె పూలమాల వేసి యాత్రను ప్రారంభించారు. చంద్రబాబు అరెస్ట్‌తో ఆవేదన చెంది మరణించిన తెదేపా కార్యకర్తలు, అభిమానుల ఇళ్లకు వెళ్లి బాధిత కుటుంబీకులను భువనేశ్వరి పరామర్శిస్తున్నారు. తొలిరోజు తిరుపతి జిల్లా చంద్రగిరిలో ఎ.ప్రవీణ్‌రెడ్డి, నేంద్రగుంటలో కె.చిన్నబ్బ కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించి ఓదార్చారు. ఆయా కుటుంబాలకు చెరో రూ.3లక్షల చెక్కును అందజేశారు. ధైర్యంగా ఉండాలని.. తామంతా అండగా ఉంటామని భువనేశ్వరి వారికి భరోసా ఇచ్చారు. వారానికి మూడు రోజులపాటు ఈ యాత్ర జరగనుంది. స్థానికంగా జరిగే సభలు, సమావేశాల్లోనూ భువనేశ్వరి పాల్గొంటారు.

## నేడు తూర్పుగోదావరి జిల్లాలో సీఎం వైయస్ జగన్ పర్యటన



తాడేపల్లి: ఈ నెల 26న ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇంద్ర వందిత్ సోదరుడు విజయ్ గణేష్ మోహన్ వివాహ రిసెప్షన్‌కు ముఖ్యమంత్రి వైయస్ జగన్ హాజరుకానున్నారు.

ఉదయం 10.15 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి రాజానగరం మండలం దివాన్‌చెరువు చేరుకుంటారు. అక్కడ డి.బి.వి.రాజు లే-అవుట్‌లో జరగనున్న విజయ్ గణేష్ మోహన్ వివాహ రిసెప్షన్‌కు హాజరుకానున్న ముఖ్యమంత్రి. అనంతరం బయలుదేరి తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

## పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి అంబటి




పశ్చిమగోదావరి: ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులకు ఇరిగేషన్ శాఖ మంత్రి మంత్రి అంబటి రాంబాబు పరిశీలించారు. ప్రాజెక్టులో దిగువ కాఫర్ డ్యాం వద్ద జరుగుతున్న డీ వాటరింగ్ పనులను స్వయంగా పరిశీలించి.. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల మధ్య ఉన్న సీ ఫేజ్ నీటి మళ్లింపు పనులను సైతం మంత్రి అంబటి పరిశీలించారు. అనంతరం మంత్రి అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించామని చెప్పారు. లోయర్, అప్పర్ కాఫర్ డ్యామ్‌ల మధ్య ఏరియాలో డీ వాటర్ వర్క్స్ జరుగుతున్నాయని, ఈ పనులు పూర్తయిన అనంతరం వైబ్రో కాంపాక్ట్ పనులు మొదలవుతాయని చెప్పారు. లోయర్, అప్పర్ కాఫర్ డ్యామ్‌ల మధ్య సీ ఫేస్ ఎక్కువ ఉండటంతో పనులకు ఆటంకం కలుగుతుందన్నారు. డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్నది, దానికి సమాంతరంగా కొత్తది నిర్మించే అంశంలో కేంద్ర జలశక్తి శాఖ ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చెప్పారు. 41.15 కాంటూరు వరకు టీడీపీ హయాంలో వేసిన అంచనాకు నేటికి ఖర్చు పెరిగిందన్నారు. 41.15 వరకు రూ.31,625 కోట్లతో సీడబ్ల్యూసీ రివైజ్డ్ కాస్ట్ కమిటీకి బిల్లు పంపించామన్నారు. 45.72 కాంటూరు వరకు మరో రూ.16 వేల కోట్లు ఖర్చుపెట్టాలని, 41.15 వరకు పూర్తయ్యాక మిగిలిన వాటి గురించి చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్రం నుంచి నిధులు మంజూరు చేయాలని, ప్రధాని మోడీని సీఎం వైయస్ జగన్ కలిశారన్నారు.

## లోకేశ్-పవన్‌ను చూసి వైసీపీలో వణుకు



తిరుపతి: నిజాలకు ప్రతిరూపం చంద్రబాబు అయితే అబద్దాలకు ప్రతిరూపం జగన్ అని తెలుగు మహిళా అధ్యక్షురాలు అనిత అన్నారు. నారావారిపల్లెలో అనిత మీడియాతో మాట్లాడుతూ మంత్రి రోజాపై మండిపడ్డారు. "తిరుమలకు వెళ్లిన నారా భువనేశ్వరి తిరుమలలో ఎక్కడ రాజకీయాలు మాట్లాడలేదు. తన భర్తతో, వేంకటేశ్వరస్వామితో తనకు ఉన్న అనుబంధాలను గుర్తుచేసుకున్నారు. అయితే మంత్రి రోజా తిరుమలకు వెళ్లి దేవుడి ఆలయం ముందు నుంచి రాజకీయాలు మాట్లాడి రోజా తన గొయ్యి తానే తవ్వుకున్నారు. వెంకన్నతో గేమ్స్ ఆడుకుంటే భవిష్యత్తు ఉండదు. తిరుమల గాలి తగిలితేనే పవిత్రమైన చైతన్యం వస్తుంది. రోజాకు ఎందుకు అలా లేదు అంటే... ఆమెకు వసూళ్లపైన ప్రేమ. ఆమె తిరుమలకు వెళ్లిన ప్రతిసారి ముప్పై టిక్కెట్లు అమ్ముకుంటుందట. చికెన్ కొట్టువాడి నుంచి కిరాణాకొట్టు, మార్బల్ కొట్టు వరకు ఎవరిని వదలకుండా మామూళు తీసుకుంటోంది. నువ్వు చేస్తున్న చిల్లర వ్యాపారంపైన సీబీఐ విచారణ చేయిద్దాం. నింద్రలో ఎర్రమట్టిపై సీబీఐ విచారణ చేయాలి. రోజా గంజి స్టేజీ నుంచి ఇప్పుడు బెంజి కథ వరకు రాష్ట్రంలో అందరికీ తెలుసు. రోజా చేతివాటం ట్రస్టు పెట్టింది. ఆమె చేతివాటం డబ్బులను ఆ ట్రస్టులో వేస్తోంది. పవన్ కల్యాణ్, లోకేశ్ ఒక ఫ్రేమ్‌లో కన్పిస్తేనే ఇలా వణికి పోతున్నారు. వారు ఇద్దరు రంగంలోకి దిగితే వీరి పరిస్థితి ఏంటీ?." అని అనిత వ్యాఖ్యానించారు.




దిల్లీ: రక్తమార్పిడి చేసే సమయంలో నిర్లక్ష్యం 14 మంది చిన్నారుల జీవితాలను ప్రమాదంలో పడేసింది. కలుషిత రక్తం ఎక్కించడం వల్ల వారికి హెచ్ఐవీ, హెపటైటిస్ బి, సీ సోకినట్లు తేలింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోకి కాన్పూర్‌కు చెందిన లాలా లజపతిరాయ్ ఆసుపత్రిలో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. దీనిపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఆ 14 మంది చిన్నారులు తలసేమియాతో బాధపడుతున్నారు. వారికి ఎప్పటికప్పుడు రక్తమార్పిడి అవసరం. ఈ క్రమంలో ప్రభుత్వ ఆధ్వర్యంలోని లాలా లజపతిరాయ్ ఆసుపత్రిలో రక్తమార్పిడి చేయించుకుంటున్నవారిలో ఏడుమందికి హెపటైటిస్ బీ, ఐదుగురికి హైపటైటిస్ సీ, ఇద్దరికి హెచ్ఐవీ సోకినట్లు వైద్యులు గుర్తించారు. ఆ పిల్లలంతా ఆరు నుంచి 16 ఏళ్ల మధ్య వయసు వారే. ఇప్పటికే తలసేమియా తో బాధపడుతోన్న వీరిని ఈ వైరస్‌లు మరింత ఇబ్బందిపెడతాయని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'మన ఆరోగ్య వ్యవస్థను డబుల్ ఇంజిన్ ప్రభుత్వం మరింత అనారోగ్యంగా మార్చింది. తలసేమియాతో బాధపడుతోన్న 14 మంది చిన్నారులకు కలుషితమైన రక్తం ఎక్కించిన ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లో వెలుగులోకి వచ్చింది. ఇంతటి దారుణమైన నిర్లక్ష్య వైఖరి సిగ్గుచేటు. దసరా సందర్భంగా పది తీర్మానాలు చేసుకోవడం గురించి ప్రధాని మోదీ మాట్లాడారు. కానీ ఆయన ఎన్నడైనా భాజపా పాలిత రాష్ట్ర ప్రభుత్వాల జవాబుదారీ గురించి ఆలోచించారా..?' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ఆ పిల్లలంతా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందినవారు. వీరికి అత్యవసర సమయాల్లో పలు ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో రక్తం ఎక్కించారని మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ ఇన్ఫెక్షన్లు సోకడానికి గల కారణాలు గుర్తిస్తున్నట్లు కాన్పూర్ వైద్యాధికారులు వెల్లడించారు.




విజయవాడ: ఏపీలోని డిస్టలరీస్ యజమానుల వివరాలు ఇవ్వగలరా? అని మేము సవాల్ విసిరామని.. కానీ ప్రభుత్వం స్పందించ లేదని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ బెవరెజెస్ కార్పోరేషన్ వద్ద 100కు డిస్టలరీ కంపెనీల నమోదయ్యాయని, కానీ 74 శాతం మద్యం సరఫరాను కేవలం 16 కంపెనీలే చేస్తున్నాయన్నారు. అదాన్ డిస్టలరీస్ 2019లో మొదలైందని, రూ. 1164 కోట్ల మేర మద్యం సరఫరా ఆర్డర్ అదాన్ కంపెనీకే ఉన్నాయన్నారు. అదాన్ కంపెనీ వెనుక ఎంపీ విజయసాయి రెడ్డి ఉన్నారని, ఈ రెండు కంపెనీలను అదాన్ బలవంతంగా చేజిక్కించుకుందని ఆమె ఆరోపించారు. చింతకాయల రాజేష్, పుట్టా మహేష్ వంటి వారికి చెందిన సంస్థలను బలవంతంగా అదాన్ కంపెనీ చేజిక్కించుకుందన్నారు. ఎస్పీవై అగ్రస్ సంస్థకు రూ. 1800 కోట్ల మేర సరఫరా ఆర్డర్స్ ఉన్నాయని, ఈ సంస్థ వెనుక మిథున్ రెడ్డి ఉన్నారని పురంధరేశ్వరి ఆరోపించారు. ప్రకాశం జిల్లాలో పెర్ల్ డిస్టలరీస్ దీన్ని సీఎం జగన్ సన్నిహితులు బలవంతం పెట్టి సబ్ లీజుకు తీసుకున్నారని విమర్శించారు. ప్రభుత్వానికి మద్యం సరఫరా చేసే కంపెనీల జాబితా.. ఆ కంపెనీల ఓనర్ల జాబితా ఇవ్వాలంటే ఇవ్వలేదని, ఇప్పుడు మేమే ఆ వివరాలు బయట పెట్టామన్నారు. దశలవారీ మద్య నిషేధం చేస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చారని, మద్యం తయారీదారులు, అమ్మకం దారులను ఏడేళ్ల పాటు జైలుకు పంపుతామన్నారని.. ఇప్పుడు మద్యం తయారీదారుల జాబితా విడుదల చేశామని.. వారిని ఎప్పుడు అరెస్ట్ చేస్తారని పురంధరేశ్వరి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. లెక్కల్లోకి రాని మద్యం డబ్బుల వివరాలేవి?.. మద్య నిషేధం అమలు చేయబోమని చెప్పి మరీ మద్యం ఆదాయాన్ని తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారన్నారు. ఫోన్ పే.. గూగుల్ పే వంటివి మద్యం దుకాణాల్లో ఎందుకు కన్పించవని పురంధరేశ్వరి నిలదీశారు. ఏపీలో అప్పుల భారాలపై కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి ప్రభుత్వం చేస్తున్న అప్పులపై ఫిర్యాదు చేశామని దగ్గుబాటి పురంధరేశ్వరి చెప్పారు. పార్లమెంట్‌లో చేసిన ప్రకటన ఆధారంగా ప్రభుత్వం అసత్యాలు ప్రచారం చేస్తోందని వివరించామన్నారు.

కార్పోరేషన్లు, రాష్ట్ర ఆస్తులను తనఖా పెట్టి అప్పులు తెచ్చారని, ఫోరెన్సిక్ ఆడిట్ చేపట్టాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశామన్నారు. సీరియల్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్, ఐటీ, ఈడీ ద్వారా మద్యం కుంభకోణాలపై విచారణ చేపట్టాలని కేంద్రమంత్రికి వినతి పత్రం ఇచ్చామని దగ్గుబాటి పురంధరేశ్వరి పేర్కొన్నారు.




హొళగుంద: ఓ చేతిలో కర్ర.. మరో చేతిలో దివిటీలు.. మది నిండా భక్తిభావంతో డిర్ర్.. గోపరాక్.. అనే శబ్దాలతో కర్నూలు జిల్లా దేవరగట్టు మారుమోగింది.

తరతరాలుగా వస్తున్న సంప్రదాయాన్ని పాటిస్తూ బన్ని ఉత్సవాన్ని మంగళవారం అర్ధరాత్రి కొనసాగించారు. ఈ నేపథ్యంలో దేవరగట్టులో మరోసారి సంప్రదాయమే గెలిచింది. యథావిధిగా కర్రల సమరం కొనసాగింది. ఈ సమరంలో 100 మందికి పైగా భక్తులు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

**ఆద్యంతం.. ఉత్కంఠగా...** దేవరగట్టుపై వెలసిన మాళ మల్లేశ్వరస్వామిని రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర ప్రాంతాల ప్రజలు భక్తిభావంతో ఆరాధిస్తారు. ఏటా విజయదశమి రోజు అర్ధరాత్రి స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా నెరణికి, నెరణికితండా, కొత్తపేట, సులువాయి, ఆలూరు, బిలేహాలు, విరుపాపురం తదితర గ్రామాల ప్రజలు మంగళవారం అర్ధరాత్రి వేళ కర్రలు చేతపట్టి దేవరగట్టుకు చేరుకున్నారు. దైవకార్యాన్ని అందరం ఐకమత్యంగా జరుపుకొంటామని డోళ్లన బండ వద్ద నెరణికి, నెరణికితండా, కొత్తపేట గ్రామాల భక్తులు పాలబాస (ప్రతిజ్ఞ) చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు.. కర్నూలు ఎస్పీ కృష్ణకాంత్, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, పత్తికొండ ఆర్డీవో మోహన్‌దాస్, డీఎస్పీ శ్రీనివాసరెడ్డికి బండారు ఇచ్చి ఉత్సవానికి అనుమతి తీసుకున్నారు. అనంతరం పెద్దఎత్తున కేకలు వేస్తూ కొండపైకి చేరుకున్నారు. కొండపై వెలసిన మాళ మల్లేశ్వరస్వామికి మల్లమ్మతో కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపుగా జైత్రయాత్రకు బయల్దేరారు. గట్టుపై నుంచి కిందకు వచ్చి సింహాసన కట్ట వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సమయంలోనే నెరణికి, కొత్తపేట, నెరణికితండా, బిలేహాల్, ఆలూరు, ఎల్లార్తి, సుళువాయి గ్రామాల మధ్య కర్రల సమరం (బన్ని ఉత్సవం) సాగింది. ఈ క్రమంలో కొందరు కర్రలను అటు ఇటు ఊపుతూ విచక్షణ కోల్పోవడంతో ఉత్కంఠ నెలకొంది.

**విరిగిపడిన చెట్టుకొమ్మ.. ముగ్గురి మృతి :** ఈ కర్రల సమరంలో ప్రమాదం జరిగింది. కర్రల సమరాన్ని చూసేందుకు కొందరు స్థానికులు సమీపంలోని చెట్టు ఎక్కారు. ప్రమాదవశాత్తు స్థానిక సింహాసన కట్ట వద్ద ఉన్న వేపచెట్టు విరిగిపడటంతో ఆస్పరికి చెందిన గణేష్(19)అక్కడికక్కడే మృతి చెందగా.. మొలగవల్లి కొట్టాల గ్రామానికి చెందిన రామాంజనేయులు(59) ఆలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన ప్రకాశ్(30) ఉత్సవాన్ని తిలకిస్తూ చనిపోయారు. మృతి ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## 'నిజం గెలవాలనుకుంటే చంద్రబాబు జీవితంలో బయటకురారు'



కృష్ణా జిల్లా: నారా భువనేశ్వరి నిజం గెలవాలి యాత్రపై మాజీ మంత్రి కొడాలి నాని మండిపడ్డారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, "నిజం గెలిచింది కాబట్టే చంద్రబాబు జైల్లో ఉన్నాడు. భువనేశ్వరి కూడా నిజం గెలవాలనుకుంటే చంద్రబాబు జీవితంలో బయటకురాడు. చంద్రబాబు కుటుంబమంతా అవినీతి సొమ్ముతో మునిగిపోయింది" అని ధ్వజమెత్తారు.

"ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు ఏ స్థితిలో ఉన్నారు.. భువనేశ్వరి ఏ స్థాయిలో ఉంది. రెండు ఎకరాలతో ప్రారంభమైన చంద్రబాబు ప్రస్థానం నేడు 2 వేల కోట్లు దాటింది. 40 రోజుల్లో ఢిల్లీ లాయర్లకు రూ.35 కోట్లు ఏ విధంగా ఫీజులు కట్టారు?. కష్టపడి పొలం దున్నితే వచ్చిన డబ్బుతోనే ఏడు కోట్లతో రూపొందించిన బస్సులో యాత్ర చేస్తున్నారా?" అంటూ కొడాలి నాని దుయ్యబట్టారు.

**చంద్రబాబు కోసమే పవన్ జన సున్నా పార్టీ..** "2019 ఎన్నికల్లో కూడా పవన్ కళ్యాణ్ తెర వెనుక టీడీపీకి మద్దతుగా ఉన్నాడని ఇప్పుడు ముసుగు తొలగింది అంతేనని కొడాలి నాని అన్నారు.

"చంద్రబాబు కోసమే పవన్ కళ్యాణ్ జన సున్నా పార్టీ పెట్టారు. లోకేష్ పప్పు అని మరోసారి రుజువైంది. ఢిల్లీ పారిపోయి తల్లిని రోడ్లపై తిప్పుతున్నాడు" అని కొడాలి వ్యాఖ్యానించారు.

## జగన్ మైండ్ ఎప్పుడు జైలు,కోర్టుల చుట్టే తిరుగుతోంది



విజయవాడ : ఏపీలో కరువు తాండవం చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. కేంద్రం ఇతర కరువు రాష్ట్రాల్లో పర్యటన చేస్తుంటే... ప్రభుత్వాలు నివేదికలు అందిస్తున్నాయన్నారు. ఇక్కడ జగన్ మాత్రం పట్టించుకోరన్నారు. రైతులు వేల రూపాయలు వెచ్చించారని.. సరైన సమయంలో సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రామకృష్ణ అన్నారు. జగన్ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమన్నారు. గతంలో ఎప్పుడు శ్రీశైలం, సాగర్ డ్యాంలలో ఇంతటి నీటి కొరత లేదన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో తాగునీటి సమస్య కూడా జఠిలం అయ్యే అవకాశం ఉందన్నారు. సీఎం జగన్ మైండ్ ఎప్పుడు జైలు,కోర్టుల చుట్టే తిరుగుతోందని రామకృష్ణ విమర్శించారు. "రాష్ట్రంలో నియంత పాలన సాగుతోంది. పుంగనూరులో టీడీపీ కార్యకర్త చొక్కా విప్పించడం,సైకిల్ కి కట్టుకున్న టీడీపీ జెండా తొలగించడం నీచాతినీచం. ఇది కేవలం టీడీపీ సమస్య కాదు. ఇది ప్రజాస్వామ్యానికే విరుద్ధం. ప్రజాస్వామ్యాన్ని పాతిపెడుతున్న జగన్ సర్కార్ పై ప్రతిఒక్కరూ పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఉంది. ఏపీ ఆర్థిక పరిస్థితిపై ఫోరెన్సిక్ ఆడిట్ సీతారామన్‌కు పురందేశ్వరి విజ్ఞప్తి చేశారు. మొదటిసారి ఫోరెన్సిక్ ఆడిట్ అనే పదాన్ని వింటున్నాం. రాష్ట్రం అప్పులకుప్పలా మారడానికి సహకారం అందించింది కేంద్రం కాదా? బీజేపీ,వైసీపీ డ్రామాలు ఆడుతోంది. వైసీపీ ప్రభుత్వం నడుస్తోంది బీజేపీ సహకారంతోనేనని టీడీపీ, జనసేన గమనించాలి" అని రామకృష్ణ అన్నారు.

## వైట్ ఫ్రాక్‌లో నభా నటేశ్ సెగలు

యంగ్ హీరోయిన్ నభా నటేశ్? అందాల ప్రదర్శనతో సోషల్ మీడియాలో అదరగొడుతోంది. తన గ్లామర్ షోతో మతులు పోగొడుతోంది. మత్తెక్కించే పోజులతో కునుకు లేకుండా చేస్తోంది. ఆమె అందాల విందుకు అస్సలు ఏమాత్రం లోటు ఉండదు. కుర్రాళ్లను మత్తులో దింపేసి.. తన ఖతర్నాక్ చూపులతో వారి హృదయాలను కొల్లగొడుతుంటుంది. తాజాగా మరోసారి అలాంటి ఫొటోషూటే చేసి కేక పుట్టించింది. కన్నడ బ్యూటీ నభా నటేశ్?.. టాలీవుడ్ యంగ్ హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకుంది. వరుస సినిమాల్లో నటిస్తూ ఇక్కడే సెటిల్ అయ్యింది. నన్ను దోచుకుందువటే చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన ఈ భామ.. తొలి చిత్రంతోనే ఇక్కడి దర్శకనిర్మాతలను బాగా ఆకట్టుకుంది. తన నటన, అందంతో ప్రేక్షకులను కూడా ఫిదా చేసింది. అలా తెలుగులో ఇప్పటి వరకు అదుగో, ఇస్మార్ట్ శంకర్,



డిస్కో రాజా, సోలో బ్రతుకే సో బెటర్, అల్లుడు అదుర్స్, మ్యాస్ట్రో వంటి చిత్రాలు చేసింది. కానీ ఈ ముద్దుగుమ్మకు మాత్రం సాలిడ్ హిట్ పడలేదు. ఇస్మార్ట్ శంకర్ ఒక్కటే ఆమెకు దక్కిన మంచి హిట్. ప్రస్తుతం ఈ భామ అవకాశాల వేటలోనే ఉంది. ఈ క్రమంలోనే సోషల్ మీడియాలో తెగ సందడి చేస్తోంది. గ్లామరే ప్రధాన అస్త్రంగా వాడుతూ నెట్టింట అందాల సునామీ సృష్టిస్తోంది. దర్శక నిర్మాత చూపు తనపై పడేలా చేస్తోంది. వరుస ఫొటోషూట్లతో ఫ్యాన్స్?ను ఫిదా చేస్తోంది. స్టన్నింగ్ ఔట్ ఫిట్‌లలో గ్లామర్ మెరుపులు మెరిపిస్తూ.. రోజుకో తీరుగా దర్శనమిస్తూ నెట్టింట అందాల విందును పంచుతోంది. తాజాగా వైట్ కలర్ ఫ్రాక్‌లో క్యూట్ సెల్ఫీలు ఇస్తూ కొంటె ఎక్స్?ప్రెషన్స్‌తో పోజులు ఇచ్చింది.

ఎద అందాల విందును పంచుతూ.. హార్ట్ బీట్ పెంచేసింది. ఈ ముద్దుగుమ్మ అందాల ప్రదర్శనకు నెటిజన్లు ఉక్కిరిబిక్కిరి అవుతూ క్రేజీగా కామెంట్లు పెడుతున్నారు. నభా అందం అదరహో అంటున్నారు. కాగా, ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ చేలితో ఒక్క చిత్రం కూడా లేదు. అవకాశాల కోసం ఎదురుచూస్తోంది.

## జూనియర్ బుట్ట బొమ్మకి స్టార్ హీరో సినిమాలో ఛాన్స్!

బుట్ట బొమ్మ అనగానే తెలుగు ప్రేక్షకుల్లో చాలా మందికి పూజా హెగ్డే గుర్తుకొస్తుంది అనడం లో సందేహం లేదు. అయితే పూజా హెగ్డే కాకుండా అనిక సురేంద్రన్ ను కూడా బుట్ట బొమ్మ అని ప్రేక్షకులు, మీడియా వర్గాల వారు కూడా పిలుచుకుంటూ ఉంటారు. అజిత్ నటించిన విశ్వాసం సినిమాతో పాటు మరికొన్ని సినిమాల్లో ఆయనకి కూతురు పాత్రలో నటించిన అనిక ప్రస్తుతం హీరోయిన్గా ప్రయత్నాలు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. తెలుగు లో బుట్ట బొమ్మ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది.



పాపం అనిక కి ఆ సినిమా కలిసి రాలేదు. దానితో తెలుగు లో ఎక్కువగా ఆఫర్లు రావడం లేదు. ఈ సమయం లోనే ఈ ముద్దుగుమ్మకి తమిళ్ సినిమా ఇండస్ట్రీ నుండి అవకాశాలు వస్తున్నాయి. తాజాగా తమిళ్ సూపర్ స్టార్ ధనుష్ బెంచ్ మార్క్ సినిమా 50వ సినిమాలో హీరోయిన్గా నటించే అవకాశాన్ని సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది. సన్ పిక్చర్స్ బ్యానర్లో భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం ధనుష్ అభిమానులతో పాటు సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అనిక కి తమిళ్ తో పాటు తెలుగు లో కూడా మంచి క్రేజ్ ఉంది. అందుకే ఆమె నటించబోతున్న ధనుష్ 50వ సినిమా కోసం ఇక్కడ కూడా కొందరు ప్రేక్షకులు ఎదురు చూసే అవకాశం ఉంటుంది. సార్ సినిమాతో తెలుగు లో కమర్షియల్ విజయాన్ని సొంతం చేసుకున్న ధనుష్ తన 50వ సినిమాతో తెలుగులో భారీ వసూళ్లు సొంతం చేసుకుంటాడేమో చూడాలి.

ఈ సినిమాతో అనిక అక్కడ ఇక్కడ మంచి మార్కులు దక్కించుకుంటుంది అనే నమ్మకం వ్యక్తం చేస్తున్నారు.





## మెగా అప్డేట్.. అనుకున్నట్టే అయ్యింది




అనుకున్నద్దే జరిగింది. కల్యాణ్ కృష్ణ సినిమాను మెగాస్టార్ చిరంజీవి పక్కనపెట్టారు. మెగా 156గా వశిష్ఠతో కలిసి సినిమాను చేయబోతున్నారు. తాజాగా ఈ విషయాన్ని గ్రాఫిక్స్‌తో డిజైన్ చేసిన ఓ స్పెషల్ పోస్టర్‌తో మేకర్స్ క్లారిటీ చేశారు. ఇప్పుడంతా దీని గురించే మాట్లాడుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. భోళాశంకర్ వంటి బిగ్గెస్ట్ డిజాస్టర్ తర్వాత మెగాస్టార్ చిరంజీవి రెండు సినిమాలు లైన్‌లో పెట్టిన సంగతి తెలిసిందే. ఒకటి బంగార్రాజు ఫేమ్ కళ్యాణ్ కృష్ణతో మరొకటి బింబిసార ఫేమ్ వశిష్ఠతో. మెగా 156గా కళ్యాణ్ కృష్ణతో రాగా.. మెగా 157గా వశిష్ఠ సినిమా రాబోతుందని ప్రచారం చేశారు. కానీ ఆ తర్వాత వశిష్ఠ సినిమాకు సంబంధించి వరుసగా అప్డేట్స్, రకరకాల ఊహాగానాలు వంటి వార్తలు వచ్చాయే తప్ప.. కళ్యాణ్? కృష్ణ సినిమాకు సంబంధించి ఏమీ రాలేదు. దీంతో కల్యాణ్ కృష్ణ సినిమాను చిరు పక్కనపెట్టారనే ప్రచారం సాగింది. ఇప్పుడా ప్రచారమే నిజమైంది. దసరా పండగా సందర్భంగా రాత్రికి ఓ స్పెషల్ పోస్టర్?ను విడుదల చేశారు మేకర్స్. మూవీ నిర్మామ సంస్థ యూవీ క్రియేషన్స్.. ఒక గ్రాఫిక్‌తో చేసిన ఆయుధమున్న పోస్టర్‌ను విడుదల చేసింది. మెగా 157 నెంబర్‌ను మెగా156గా మార్చి విషయాన్ని క్లారిటీ ఇచ్చింది. అంటే భోళా శంకర్ తర్వాత ఇప్పుడు రానున్న సినిమా ఇదేనన్న మాట. భోళా శంకర్ డిజాస్టర్ కావడం, కథల సెలక్షన్స్?పై భారీగా విమర్శలు రావడంతో.. చిరు ఆత్మపరిశీలన చేసుకుని రీమేక్‌ను నో చెప్పి.. ఫాంటసీకి షిఫ్ట్ అయిపోయారు. ఇకపోతే సినిమాకు సంబంధించి పాట రికార్డింగ్‌తో పూజా కార్యక్రమాలు మొదలుపెట్టారట. ఎంఎం కీరవాణి స్వరపరిచిన ఒక సాంగ్‌ను రికార్డు చేసినట్టు సమాచారం అందింది. అయితే దీనికి సంబంధించి అధికారిక సమాచారం ఏమీ లేదు. ఈ చిత్రం పూర్తవ్వడానికి వచ్చే ఏడాది అయ్యేలా ఉంది. 2025 సంక్రాంతికి బరిలో దింపాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. నలుగురు హీరోయిన్లు నటించే అవకాశముందని అంటున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో..

## గ్లామర్ తో హీటెక్కిస్తున్న డెవిల్ బ్యూటీ




ఇరాన్ కి చెందిన ఇండియన్ మోడల్, యాక్టర్ ఇల్నాజ్ నోరంజీ గురించి బాలీవుడ్ లో ఎక్కువ మందికి తెలుసు. సాక్రేడ్ గేమ్స్ మూవీస్ తో ఈ బ్యూటీ నటిగా కెరియర్ స్టార్ట్ చేసింది. వెబ్ సిరీస్ ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఓ వైపు మోడల్ గా రానిస్తూనే వెబ్ సిరీస్, హిందీ సినిమాలలో నటిగా కెరియర్ బిల్డ్ చేసుకునే పనిలో ఉంది. ఈ బ్యూటీకి బాలీవుడ్ లో మంచి పేరుంది. ప్రస్తుతం ఈ ఇరానియన్ బ్యూటీ నటిగా టాలీవుడ్ లోకి అడుగుపెడుతోంది. కళ్యాణ్ రామ్ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న డెవిల్ మూవీలో రోజీ అనే పాత్రలో ఈ బ్యూటీ నటిస్తోంది. గ్లామర్ క్వీన్ గా బ్రిటిష్ విమెన్ గా ఆమె పాత్ర డెవిల్ సినిమాలో ఉండబోతోందని తెలుస్తోంది. ఈమె క్యారెక్టర్ కి సంబందించిన ఫస్ట్ లుక్ ని తాజాగా చిత్ర యూనిట్ రిలీజ్ చేసింది. ఫస్ట్ లుక్ పోస్టర్ లో ఇల్నాజ్ హాట్ గా కనిపిస్తూ ఉండటం విశేషం. పబ్ నేపథ్యంలో బార్ గర్ల్ గెటప్ లో ఆమె ఆహార్యం ఉంది. సినిమాలో ఆమె పాత్ర చాలా కీలకంగా ఉండబోతోందని ఫస్ట్ లుక్ పోస్టర్ బట్టి తెలుస్తోంది. డెవిల్ మూవీ పాన్ ఇండియా రేంజ్ లో తెరకెక్కుతోంది. శ్రీకాంత్ విస్సా ఈ చిత్రానికి కథ అందిస్తూ ఉండటం విశేషం. నవంబర్ 24న ఈ మూవీ థియేటర్స్ లోకి రాబోతోంది. ఇప్పటికే ప్రేక్షకుల ముందుకి వచ్చిన టీజర్ అందరికి భాగా కనెక్ట్ అయ్యింది.

సినిమాలో కళ్యాణ్ రామ్ రోల్ బ్రిటిష్ ఇండియా గవర్నమెంట్ లో పనిచేసే సీక్రెట్ ఏజెంట్ గా ఉండబోతోంది. సంయుక్త మీనన్ ఈ చిత్రంలో కళ్యాణ్ రామ్ కి జోడీగా నటిస్తోంది. బింబిసార తర్వాత కళ్యాణ్ రామ్ నుంచి రాబోతోనున్న భారీ బడ్జెట్ చిత్రం ఇదే కావడం విశేషం. మధ్యలో అమిగోస్ మూవీ రిలీజ్ అయిన బడ్జెట్ పరంగా డెవిల్ కంటే తక్కువే అని చెప్పాలి.

## నిత్యా అందుకే అలాంటివి చేస్తుందా..?

మలయాళ భామ నిత్యా మీనన్ ఈమధ్య సినిమాల్లో కనిపించడం మానేసింది. తెలుగు తమిళ భాషల్లో తన నటనతో ప్రేక్షకులను మెప్పిస్తూ వచ్చిన నిత్యా మీనన్ గ్లామర్ రోల్స్ కి దూరంగా ఉంటూ వచ్చింది. అయినా సరే నటనా ప్రాధాన్యత ఉన్న సినిమాలు చేస్తూ ప్రేక్షకులకు దగ్గరైంది. అయితే ఏమైందో ఏమో కానీ కొన్నాళ్లుగా నిత్యా మీనన్ కి సరైన అవకాశాలు రాలేదు. మహానటి సినిమా వదులుకున్నప్పటి నుంచి ఆమె మీద ఒకరమైన నెగిటివిటీ కూడా ఏర్పడింది. బాలకృష్ణ కథానాయకుడు సినిమాలో నటించిన నిత్యా మీనన్ తెలుగులో సినిమాలు చేయలేదు కానీ తమిళంలో మాత్రం చేస్తూ వచ్చింది. ఈమధ్య సినిమాల కన్నా వెబ్ సీరీస్ ల మీద ఎక్కువ దృష్టి పెట్టింది నిత్యా మీనన్. రీసెంట్ గానే అమెజాన్ ప్రైమ్ లో కుమారి శ్రీమతి వెబ్ సీరీస్ చేసిన నిత్యా మీనన్ డిస్నీ హాట్ స్టార్ కోసం మాస్టర్ పీస్ అనే వెబ్ సీరీస్ లో నటించింది. నిత్యా మీనన్ సినిమాలను వదిలి వెబ్ సీరీస్ లు చేయడానికి కారణాలు ఏంటన్నది తెలియాల్సి ఉంది. అయితే సినిమాలైతే కథ కథనాలు ఎలా ఉన్నా



చేయాలి అవి చాలదు అన్నట్టు సాంగ్స్ కూడా ఉంటాయి. వీటికన్నా వెబ్ సీరీస్ లు చేస్తే పాత్ర ప్రాధాన్యత ఉన్న కథలే దొరుకుతాయని వెబ్ సీరీస్ లకే ఫిక్స్ అయ్యింది నిత్యా మీనన్. సినిమా అయినా వెబ్ సీరీస్ అయినా తనకు ఇచ్చిన పాత్రకు పూర్తి స్థాయిలో న్యాయం చేసే నిత్యా మీనన్ కాస్త సిల్వర్ స్క్రీన్ ఆఫర్ల మీద కూడా ఫోకస్ చేస్తే బెటర్ అని భావిస్తున్నారు ఆమె ఫ్యాన్స్. తెలుగు తమిళ భాషల్లో నటిగా సూపర్ క్రేజ్ తెచ్చుకున్న నిత్యా మీనన్ ఇక మీదట సినిమాల్లో కూడా వరుసగా నటించాలని ఆడియన్స్ కోరుతున్నారు. మరి నిత్యా మీనన్ ఈ విషయంలో ఏం నిర్ణయించుకుంటుందో చూడాలి.

ఒకవేళ సినిమాలు చేద్దామని ఉనా ఆమెకు తగిన పాత్రలు కథలు రాకనే నిత్యా మీనన్ సినిమాలు చేయట్లేదు అన్న టాక్ వినిపిస్తుంది. అదే వెబ్ సీరీస్ లు అయితే ఆమె ఇమేజ్ కి తగిన కథలు వస్తాయని అవి చేస్తుంది. ఈమధ్య వచ్చిన కుమారి శ్రీమతి వెబ్ సీరీస్ మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది.తెలుగులో నిత్యాకు సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. మళ్లీ అమ్మడు సరికొత్త పాత్రలతో వస్తే తప్పకుండా ఆమెను ఆదరించే అవకాశం ఉంది. లాస్ట్ ఇయర్ స్కై ల్యాబ్, భీమ్లా నాయక్ సినిమాల్లో నటించిన నిత్యా మీనన్ తెలుగులో అవకాశం వస్తే తప్పకుండా చేస్తానని అంటుంది.

## ఆ హీరోయిన్ ని బ్యాడ్ టైమ్ బంతాడేస్తోంది!

హీరోల కు ఉన్నంత లైప్ స్పాన్ హీరోయిన్లకు ఉండదు. ఫేం లో ఉన్నంత కాలం కొనసాగుతారు. ఆ తర్వాత ఇంటికెళ్లిపోతారు. అవకాశాలు రావడం గొప్ప కాదు. వాటిని నిలబెట్టుకుని ముందుకెళ్లడం గొప్ప. ఈ విషయంలో ఢిల్లీ బ్యూటీ కేతిక శర్మ వైఫల్యం లో కనిపిస్తోంది. రొమాంటిక్ సినిమాతో మెరుపు వేగంతో దూసుకొచ్చిన బ్యూటీ కి తొలి సినిమా ఫలితం బెడిసి కొట్టింది. అయినా సరే అమ్మడిలో కొన్ని రేర్ క్వాలిటీస్ కెరీర్ లో ముందుకు తీసుకెళ్లాయి. ఆ వెంటనే 'లక్ష్య'..'రంగరంగ వైభవంగా' లాంటి సినిమాల్లో ఛాన్సులందుకుంది. 'రంగరంగ బాగానే ఆడినా కేతిక పెద్దగా ఫోకస్ కాలేదు. ఇక లక్ష దారుణమైన ఫలితాన్ని చవి చూసింది. ఇలా ఇన్ని వైఫల్యాలున్నా! కేతికకి 'బ్రో' సినిమాలో అవకాశం వెతుక్కుంటూ మరీ వచ్చింది. పవన్ కళ్యాణ్ దేవుడిగా నటించిన సినిమాలో అవకాశం అంటే మాటలా? నిజంగా పెట్టి పుట్టాలి. ఆయన తో సీన్లు లేకపోయినా



సినిమాలో భాగమైతేనే బోలెడంత క్రేజ్ వచ్చేస్తుంది. కానీ ఈ సినిమా విషయంలో అదేం జరగలేదు. సినిమాలో తన పాత్రకి పెద్దగా ప్రాధాన్యత లేకపోవడంతో ఫోకస్ అవ్వలేదు. సినిమా ఫలితం బాగానే ఉన్నా! కేతిక పేరు పెద్దగా వైరల్ అవ్వడం లేదు. మరి మూడు ప్లాప్ లు చూసి..ఒక హిట్ అందుకున్న భామ కెరీర్ ని ఎలా డిసైడ్ చేయాలంటే? కేతిక ని డ్యాడ్ టైమ్ బంతాడేస్తున్నట్లే కనిపిస్తోంది. హిట్ వచ్చినా గుర్తింపు రాలేదంటే! అంతకు మించిన అన్ లక్ హీరోయిన్ ఎవరుంటారు. చిన్న సినిమా హిట్ అయితేనే నవ నాయికలు బోలెడంత హంగామా చేసేస్తున్నారు.

కానీ కేతిక విషయంలో అలా జరగడం లేదు. మరి అమ్మడు తనని తాను అలా ఫోకస్ చేసుకోవడంలో విఫలమవుతుందా? లేక తెలిసి తెలియని తప్పిదాల కారణంగా అలా జరుగుతందా? అన్నది దృష్టి పెట్టాలి. ప్రస్తుతం కేతిక శర్మ హ్యాండ్స్ లో ప్రాజెక్ట్ లేవి కనిపించడం లేదు. మరి బ్రో విజయం అయినా కొత్త అవకాశాల కు బలమైన పునాది వేస్తుందా? అన్నది చూడాలి.




హైదరాబాద్: ఒక్క అవకాశం ఇవ్వమంటున్న కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దని మంత్రి కేటీఆర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పెద్దపల్లికి చెందిన కాంగ్రెస్ నేతలు సత్యనారాయణరెడ్డి, రామ్మూర్తి బుధవారం తెలంగాణ భవన్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో భారాసలో చేరారు. వీరికి కేటీఆర్.. గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయిన కర్ణాటక ప్రజలు కరెంటు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. 24 గంటలా.. 3 గంటల కరెంటు కావాలా? ప్రజలే ఆలోచించుకోవాలన్నారు. "భారాసను తెలంగాణ ప్రజలు తమ ఇంటి పార్టీగా భావిస్తారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఒక్కో సమస్యను పరిష్కరించుకుంటూ వస్తున్నాం. విద్యుత్ సమస్య, నీళ్ల సమస్య పరిష్కరించుకున్నాం. కాళేశ్వరం ప్రాజెక్టుతో కరీంనగర్ జిల్లా అంతా పచ్చగా మారింది.

రైతు బంధు కింద రూ.73వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం. కేసీఆర్ మళ్లీ గెలిస్తే కచ్చితంగా జాబ్ క్యాలెండర్ అమలు చేస్తాం. కేసీఆర్ భరోసా కింద తెల్లరేషన్ కార్డుదారులకు సన్నబియ్యం ఇస్తాం. కేసీఆర్ భరోసా కింద 15 కొత్త కార్యక్రమాలు అమలు చేస్తాం" అని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు.




## డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యం: జాఫర్ ఇస్లాం

హైదరాబాద్: తెలంగాణ ఎన్నికల్లో గెలుపు కోసం సీరియస్‌గా పని చేస్తున్నామని, డబుల్ ఇంజన్ సర్కార్ తోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జాఫర్ ఇస్లాం అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ కుటుంబం, అవినీతి గురించే బీఆర్ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్‌లు ఆలోచిస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణ కోసం బీజేపీ మద్దతు తెలిపిందని, ఇక్కడ ప్రజల అభ్యున్నతి కోసం తెలంగాణకు సపోర్ట్ చేశామని అన్నారు. రాష్ట్రం వచ్చిన తర్వాత ఒకే కుటుంబానికి లబ్దిచేకూరుతుందని, బీఆర్ఎస్ అంటే.. 'భ్రష్టేచార్ రిస్తేదార్ పార్టీ' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి చేసే పార్టీ అని, ఎంఐఎం కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు బీ టీంగా పని చేస్తున్నాయని, అలాగే యూపీఏకూ బీఆర్ఎస్ ఎక్స్ట్రా ప్లేయర్‌గా పనిచేస్తోందని జాఫర్ ఇస్లాం అన్నారు. ఈ పార్టీలన్నీ అవినీతి చేయడానికే పనిచేస్తాయని, కర్ణాటకలో భారీగా డబ్బు పట్టుకుంటున్నారని, ఆ డబ్బు కాంగ్రెస్ పార్టీ నేత వద్దే దొరికిందని అన్నారు. దొరికింది కొంత మాత్రమే.. వేల కోట్ల రూపాయల లింక్ దొరికిందన్నారు. కర్ణాటక నుంచి ఎన్నికలు జరుగుతున్న అన్ని రాష్ట్రాలకు డబ్బు పంపుతున్నారని ఆరోపించారు. కర్ణాటక కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంగా మారిందన్నారు. ఏజెన్సీని పెట్టుకుని డబ్బు పెంచేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ స్లీపర్ సెల్ తమిళనాడు సర్కారు సహకారంతో తెలంగాణకు డబ్బు చేరుతోందని.. కర్ణాటక నుంచి తమిళనాడు ద్వారా రాష్ట్రానికి డబ్బు చేరుతోందని జాఫర్ ఇస్లాం అన్నారు. బీజేపీ డబ్బుతో పనిచేయడం లేదని... కార్యకర్తలు కష్టపడి పని చేసి అధికారంలోకి తెస్తారని, తమ కార్యకర్తలు సయితం ఈ డబ్బు పట్టుకునేందుకు పని చేస్తారన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బలిదానాలు చేసుకున్న వారి ఆశయాలు గుర్తు చేసుకుని ఓటేయాలని సూచించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అవినీతిపై విచారణ జరుగుతోందని, ఎట్టిపరిస్థితుల్లోనూ ఆగదని, అవినీతి చేసిన కవితను వదిలే ప్రసక్తే లేదని జాఫర్ ఇస్లాం స్పష్టం చేశారు.




హైదరాబాద్: తెలంగాణ బీజేపీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాషాయపార్టీకి రాజీనామా చేసి సొంతగూటిలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు బుధవారం ఉదయం తన నిర్ణయాన్ని ప్రకటించారు. ఈ పరిణామంపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. రాజీనామా చేయడం అనేది అయన వ్యక్తిగతమని అన్నారు. తెలంగాణాలో బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం ముమ్మాటికీ బీజేపీ పార్టీనేనని కిషన్ రెడ్డి దీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కు బీజేపీ ప్రత్యామ్నాయం కాదని రాజగోపాల్ రెడ్డి అన్నంత మాత్రాన కాకుండాపోదని పేర్కొంది. వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని ఆయన దీమా వ్యక్తం చేశారు.

## ప్రజలు మార్పు కోరుకుంటున్నారు..




హైదరాబాద్: ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, కాంగ్రెస్‌లో చాలా మంది చేరుతున్నారని, తన సోదరుడు రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరిక విషయం తనతో మాట్లాడలేదని.. అధిష్టానంతో మాట్లాడారని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ తన సోదరుడే కాదని.. చాలా మంది కాంగ్రెస్‌లో చేరుతున్నారని, కర్ణాటకలో హామీ ఇచ్చిన పథకాలు అమలు అవుతున్నాయని పేర్కొన్నారు. సెకండ్ లిస్ట్ ఈరోజు పూర్తవుతుందని, రేపు విడుదల అవుతుందని చెప్పారు. 6 స్థానాల్లో మాత్రమే ఇబ్బందులు ఉన్నాయని, అక్కడ ఇద్దరు ముగ్గురు పోటీ పడుతున్నారని ఆయన అన్నారు. సీఈసీ ఫైనల్ అయ్యేవరకు బయట మాట్లాడకూడదని, గతంలోనే కాళేశ్వరంపై విచారణ జరపాలని ప్రధానికి లేఖ రాసామని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. వామపక్షాలకు నాలుగు సీట్లు అంటే తక్కువ కాదని, మిర్యాలగూడలో కూడా అడిగారని, అక్కడ ఓటు ఎంత వరకు ట్రాన్స్‌ఫర్ అవుతుందనేది చూడాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి 70 నుంచి 80 సీట్లు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పొత్తులపై బుధవారం సాయంత్రం క్లారిటీ వస్తుందన్నారు. రాహుల్ గాంధీ పేరు చెప్పే అర్హత కేటీఆర్‌కు లేదని, రాహుల్ గాంధీ కుటుంబానికి ఇల్లు కూడా లేదని, ఇప్పుడు మీ ఆస్తులెంత కేటీఆర్ అంటూ ప్రశ్నించారు. అధిష్టానం ఎక్కడ పోటీ చేయమంటే అక్కడ చేస్తానని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

## నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా సునీతా లక్ష్మారెడ్డి.. బీ-ఫామ్ అందజేసిన సీఎం కేసీఆర్



హైదరాబాద్ : ఉమ్మడి మెదక్ జిల్లాలోని నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా సునీతా లక్ష్మారెడ్డి పేరును సీఎం కేసీఆర్ ఖరారు చేశారు. దీంతో ప్రగతి భవన్‌లో సునీతా లక్ష్మారెడ్డికి కేసీఆర్ బీ-ఫామ్ అందజేశారు. ఎమ్మెల్యే మదన్ రెడ్డితో కలిసి సునీత బీ-ఫామ్ అందుకున్నారు.

**సునీతా లక్ష్మారెడ్డి రాజకీయ నేపథ్యం..** కాంగ్రెస్ పార్టీ తరపున నర్సాపూర్ నియోజకవర్గం నుంచి 1999, 2004, 2009 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా సునీతా లక్ష్మారెడ్డి గెలిచారు. 2009లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి మంత్రివర్గంలో చిన్ననీటి వనరుల శాఖ మంత్రిగా పని చేశారు. ఆ తర్వాత రోశయ్య మంత్రివర్గంలో కొనసాగారు. 2010లో కిరణ్ కుమార్ రెడ్డి కేబినెట్‌లో మహిళా శిశు, దివ్యాంగుల సంక్షేమం, స్వయం సహాయక సంఘాలు, ఇందిరా క్రాంతి పథం, పింఛన్ల శాఖ మంత్రిగా విధులు నిర్వర్తించారు. 2004 నుంచి 2009 వరకు శాసనసభ మహిళా శిశు సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్‌గా కొనసాగారు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన సునీతా లక్ష్మారెడ్డి, 2019, ఏప్రిల్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. అనంతరం మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా సునీతా లక్ష్మారెడ్డి నియామకం అయ్యారు.

## ఆత్మీయ సమావేశంలో తుమ్మల..

ఖమ్మం: తెలంగాణ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ఖమ్మం 54వ డివిజన్‌లో ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా చేసిన ర్యాలీలో ఖమ్మం ప్రజానీకం పోటెత్తారని అన్నారు.

ఖమ్మం ప్రజానీకం రాజకీయ చైతన్యం కలవారని, ఖమ్మంలో నెలకొన్న అరాచక రాజకీయాన్ని తరిమి కొట్టడంలో మీరంతా కథం తొక్కాలని పిలుపిచ్చారు. ఎన్టీ రామారావు తనకు రాజకీయ జన్మ ఇస్తే.. అధికారంలో ఉన్నపుడు ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి కోసం




అహర్నిశలు పాటుపడ్డానని చెప్పారు. ప్రజలంతా ప్రస్తుతం జరిగే ఎన్నికల్లో చారిత్రక తీర్పు ఇవ్వాలని తుమ్మల నాగేశ్వరరావు కోరారు.

## మెదక్ ఎంపీ స్థానం నుంచి మదన్ రెడ్డి పోటీ.. ప్రకటించిన సీఎం కేసీఆర్

హైదరాబాద్ : ప్రస్తుతం నర్సాపూర్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న మదన్ రెడ్డికి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. పార్టీలో అంతర్గత సర్దుబాటు చేస్తూ, అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో భేటీ అయిన పార్టీ కోర్ కమిటీ సభ్యులు ఈ నిర్ణయం తీసుకున్నారు. అనంతరం సునీతా లక్ష్మారెడ్డిని నర్సాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా కేసీఆర్ ఖరారు చేశారు. అనంతరం ఆమెకు బీ-ఫామ్ అందజేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ కీలక సభ్యులు ఏకగ్రీవంగా తీసుకున్న నిర్ణయం పట్ల సీఎం కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. 'మదన్ రెడ్డి నాతో పార్టీలో మొదటినుంచి కొనసాగుతున్న సీనియర్ నాయకుడు. 35 ఏండ్ల నుంచి నాతో సన్నిహితంగా కొనసాగుతున్న నేతగా నాకు అత్యంత ఆప్తుడు. నాకు కుడి భుజం లాంటివాడు. సోదర సమానుడు. పార్టీ ఆలోచనలను గౌరవించి నర్సాపూర్ ఎన్నికలను తన భుజస్కందాలమీద వేసుకుని సునీత లక్ష్మారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించే బాధ్యత తీసుకున్నందుకు సంతోషంగా ఉంది. ప్రస్తుతం కొత్త ప్రభాకర్ రెడ్డి ఎంపీగా కొనసాగుతున్న పార్లమెంటరీ స్థానం నుండి మదన్ రెడ్డికి అవకాశం ఇవ్వాలని పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు పార్టీ కీలక సభ్యులకు, కార్యవర్గానికి అభినందనలు. వారి సీనియార్టీని పార్టీ గుర్తించి గౌరవించినందుకు పార్టీ ముఖ్య కార్యవర్గాన్ని అభినందిస్తున్నాను. మెదక్ జిల్లాలో అత్యంత ప్రజాదరణ కలిగిన నేతగా కేవలం నర్సాపూర్‌లోనే కాకుండా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వారు పాపులర్ లీడర్. వివాద రహితుడైన మదన్ రెడ్డి సేవలను పార్టీ మరింత గొప్పగా వినియోగించుకోవాల్సి ఉంది. చిన్న చిన్న సర్దుబాట్లు చేసుకుంటూ కీలక సమయంలో ఐక్యంగా ముందుకు పోవడం ద్వారా మదన్ రెడ్డి పార్టీ ప్రతిష్టను మరింత ఇనుమడింప చేశారు. వారికి నా ధన్యవాదాలు అభినందనలు' అని బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ తెలిపారు.



## వచ్చే ఎన్నికల్లో ఢిల్లీ పార్టీలకు బుద్ధి చెప్పాలి : మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్ : తెలంగాణ రాష్ట్రం రాకముందు అభివృద్ధి శూన్యం. కరెంటు, నీళ్లు లేక రైతులు ఆగమయ్యారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం ఆనవాయితీ ప్రకారం మంత్రి బొమ్మకల్ నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాడు కరెంటు ఎప్పుడు వస్తదని రైతుల ఎదురు చూసేవారు. కరువు కాటకాలతో రైతులంతా దుబాకియికి వలసలు వెళ్లారు. మానేరు డ్యాం తలాపున ఉన్నా తాగటానికి చుక్క నీరు ఉండకపోయేదని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాక అభివృద్ధిలో కరీంనగర్ దూసుకుపోతున్నదని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణను కాంగ్రెస్ చేతిలో పెడితే అభివృద్ధి కుంటుపడుతుందన్నారు.సమైక్య పాలనలో తెలంగాణ సంపదను ఆంధ్రులు దోచుకెళ్లారు. అభివృద్ధి చెందిన తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత మీ చేతుల్లోనే ఉందన్నారు. కరీంనగర్‌లో



ఎక్కడ చూసినా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. రానున్న ఎన్నికల్లో ఢిల్లీ పార్టీలకు బుద్ధి చెప్పాలి. పోరాడి తెచ్చుకున్న తెలంగాణను కాపాడుకోవాలన్నారు. ప్రజల మధ్యలో ఉన్న నాయకుడికి పట్టం కట్టాలి. రానున్న ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

## కాళేశ్వరం ప్రాజెక్టులో నిర్మాణ లోపాలు లేవు : ఈఎన్‌సీ మురళీధర్

రాష్ట్ర నీటి పారుదల శాఖ ఇంజినీర్లతో కేంద్ర బృందం భేటీ ముగిసింది. సీడబ్ల్యూసీ చీఫ్ ఇంజినీర్ అనిల్ జైన్ నేతృత్వంలో కేంద్ర బృందం సమావేశం కాగా, ఈఎన్‌సీలు మురళీధర్, నాగేంద్రరావు, వెంకటేశ్వర్లు, ఓఎస్‌డీ శ్రీధర్ దేశ్‌పాండే, ఎల్ అండ్ టీ ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మేడిగడ్డ ఆనకట్ట కుంగిన వ్యవహారంపై ఇంజినీర్లు సమీక్షించారు. ఆనకట్టకు సంబంధించిన సాంకేతిక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టులో నిర్మాణ లోపాలు లేవు అని స్పష్టం చేశారు. ఏడో బ్లాక్‌లో సమస్య రావడం వల్ల సెంటర్ పియర్ కుంగిందని తెలిపారు. ఎక్కడో చిన్న పొరపాటు అయితే జరిగింది. ఇసుక వల్ల సమస్య వచ్చిందని అనుకుంటున్నాం. క్వాలిటీ ఆఫ్ సాండ్, క్వాలిటీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌పై అనుమతులు ఉన్నాయి. కాపర్ డ్యామ్‌కు వరద తగ్గిన తర్వాత నవంబర్‌లో సమగ్ర పరిశీలన చేపడుతామని మురళీధర్ పేర్కొన్నారు. మేడిగడ్డ బరాజ్‌లోని పిల్లర్ కుంగుబాటు వల్ల కాళేశ్వరం ఆయకట్టుకు ఎలాంటి ధోకా లేదని, యథావిధిగా సాగునీటిని అందించే అవకాశం ఉన్నదని ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు చెప్తున్న విషయం తెలిసిందే.

## నేడు మునుగోడుకు సీఎం కేసీఆర్..ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్



నల్లగొండ : జిల్లాలోని మునుగోడులో రేపు జరగనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను పకలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, ఎస్పీ అపూర్వ రావుతో కలిసి పరిశీలించారు. హెలిప్యాడ్, బందోబస్త్ చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండొద్దన్నారు. మునుగోడులో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద పరిస్థితిని సమీక్షించారు. అలాగే పలు వాహనాల తనిఖీలను పరిశీలించారు. ఎన్నికలు సమీస్తున్న తరుణంలో ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని, తనిఖీలను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు.

## రేవంత్ రెడ్డి వల్ల నాకు ప్రాణహాని.. డీజీపీకి కురువ విజయ్ ఫిర్యాదు

హైదరాబాద్ : టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వల్ల తనకు ప్రాణహాని ఉందని రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్‌కు టీ పీసీసీ ప్రచార కమిటీ సభ్యులు కురువ విజయ్ కుమార్ ఫిర్యాదు చేశారు. డీజీపీకి ఫిర్యాదు చేసిన అనంతరం విజయ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. తమ ఫిర్యాదుపై డీజీపీ సానుకూలంగా స్పందించారు. తక్షణమే విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కోసం 15 ఏండ్లుగా అహర్నిశలు పని చేసిన తనను కాదని, నిన్నమొన్న పార్టీలో చేరిన వ్యక్తికి గద్వాల టికెట్ ఇచ్చారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే టికెట్లను డబ్బులకు, భూములకు అమ్ముకుంటున్నారని తెలిపారు. ఎమ్మెల్యే టికెట్ల విషయంలో రేవంత్ రెడ్డి డబ్బులు తీసుకోకపోతే.. భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి అక్రమ ఆస్తులపై విచారణ జరపాలని ఈడీకి ఫిర్యాదు చేశామని, ఈ నేపథ్యంలో ఆయన అనుచరులు తమను భౌతికంగా వేధిస్తున్నారని విజయ్ కుమార్



పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పని చేసి, గత 15 ఏండ్ల నుంచి కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తుంటే, ఇవాళ అకారణంగా తనను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన తమను అణగదొక్కడానికి రేవంత్ కుట్రలు చేస్తున్నారని విజయ్ కుమార్ మండిపడ్డారు.

## ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో అలయ్ బలయ్.. హాజరైన ఎంపీ కేకే



హైదరాబాద్: తెలంగాణ సంప్రదాయానికి ప్రతిబింబం అలయ్ బలయ్. రాజకీయ నేతలను ఏకతాటిపైకి తీసుకొచ్చే పండుగ. ప్రతి ఏటా దసరా మరుసటి రోజు హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే. కేశవరావు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, మీనాక్షీ లేఖి, మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు జానారెడ్డి, కంభంపాటి హరిబాబు, రాధా కృష్ణన్, వీ.హనుమంతరావు, ప్రముఖులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా వారందరిని దత్తాత్రేయ శాలువాతో సన్మానించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com